# స్త్రీల వ్రత కథలు

## 1. శ్రావణ మంగళవారము నోముకథ

పూర్వం అవంతీపురంలో ఒక బ్రాహ్మణుడుండేవాడు అతనికిసంతానం లేదు సంతానం కొరకు పార్వతీ పరమేశ్వరుల్ని గురించి తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఏ వరం కావాలో కోరుకోమన్నాడు. పరమేశ్వరా! నాకు సంతానభిక్ష పెట్టవలసిందిగా కోరుకున్నాడు. ఓయీ! నీకు ఆయువులేనికొడుకుకావలెనా, ఐదోతనంలేని కుమార్తె కావలెనా కోరుకోవల సిందన్నాడు సదాశివుడు. ఏమనికోరడానికి తోచలేదు ఆ విప్రునకు. భార్యనడిగి వచ్చెదననిఇంటికి వెళ్లాడు. భార్యనుపిలిచిమనకు ఆయువులేని కొడుకు కావలెనా, ఐదవతనం లేని కుమార్తె కావలెనా ఏ వరం కావలెనని కోరుకోమనెదవని భార్యనుఅడిగెను అందులకు ఆమె నాథా! పుట్టిచచ్చిన కొడుకే మేలు ఐదవతనము లేని కుమార్తెతో బాధపడలేమని చెప్పింది.

ఆ విప్రుడు ఆ ప్రకారంగా పార్వతి పరమేశ్వరులను కోరుకున్నాడు. సరే నీవు ఇంటికి వెళ్లు మార్గంలో ఉన్న మామిడిచెట్టు కాయను కోసుకునివెళ్లి నీ భార్యకు ఇవ్వవల సినది ఆమె గర్భవతి కాగలదని వరమిచ్చి అదృశ్యమయ్యాడు. అతడా మామిడి చెట్టు చెంతకుపోయి ఆశకొలది కొన్ని కాయలు కోసుకుని ఇంటికి వెళ్లి ఒడిలో చూచుకుంటే ఒక్కకాయే ఉన్నది. పరమేశ్వరుని లీలలు అమోఘమని సమర్థించుకుని ఆ కాయను భార్యకిచ్చాడు అదితిని ఆమె గర్భవతి అయ్యింది. నవమాసాలు నిండిన తదుపరి పండంటి కుమారుడ్ని కన్నది.

ఆ బాలుడు పుట్టిన వెంటనే వానిని గొనిబోవ యమభటులు వచ్చారు. అయ్యలారా! ఇదేమి ధర్మము వర ప్రభావంచే బిడ్డ కలిగెనే గాని ఇంచుక ముచ్చటైనా తీరలేదు. నన్ను అనుగ్రహించి పురుడయినా అయ్యేవరకు ఆగవలసిందని వేడుకున్నది. అందులకు అంగీకరించి ఆ యమభటులు వెడలిపోయిరి. పురుడు పూర్తయిన వెనువెంటనే యమభటులు వచ్చి బాలుని తీసుకునిపోబోయిరి. తల్లి వాళ్లకాళ్లమీదపడి దయామయు లారా, బిడ్డ అడుగులు వేయగా చూచు భాగ్యమును అనుగ్రహించవల సినదనికోరుకున్నది. అందుకువారుఅంగీకరించివెళ్లిపోయారు. బాలుడుఎదిగి చిడుముడి అడుగులు వేస్తున్న సమయంలో వానిని తీసుకుని పోవగా యమభటులువచ్చిరి. వరపుత్రుడు కలిగిన వేడుక తీరనేలేదు.నాయందుదయుంచి వానికి అక్షరాభ్యాసముచేయు అవకాశమును అనుగ్రహించ వలసినదని వేడుకున్నది. సరియని వెళ్లిపోయిన యమధూతలు అక్షరాభ్యాసం పూర్తిగావడమే తడవుగా వచ్చారు. సమవర్తి ధూతలారా! ఇది మీకు తగదు. సమముగా జరుపు విజ్ఞుని ధూతలు అస్తవ్యస్తమొనర్చి ఏడ్పించుట మీకు తగదు. నా బిడ్డడు విద్యాబుద్ధులందెరుగు వరకైనా చూచుకొను భాగ్యమును కలిగించండి అని ప్రార్థించింది, అలా ప్రతిసారి ఏదోఒక కోరిక కోరి నెట్టుకొస్తున్నది.

కాలం గడుస్తున్నది,కుమారుడు పెరిగి యుక్తవయస్కుడయ్యాడు. ఒకనాడు తల్లి బిడ్డడికి తలంటినీళ్లు పోస్తుండగా యమభటులు గుర్తుకువచ్చి వారిని ఇంకనూ కరుణించ మనుట అలవికాదని విచారించుచుండగా ఆమె కంటినుండి రెండు చుక్కల నీళ్ళు బాలుని తలపై పడెను ఆ వెచ్చటి కన్నీటిబిందువులు మేనుకుసోకగానే తలపైకెత్తిచూచి ఎందువల్ల యేడ్చుచున్నావని ప్రశ్నించాడు ఏమని చెప్పను నాయనా నాబాధ, ఎంతకాలానికీ మాకు సంతానం లేదు. పరమేశ్వరుని అనుగ్రహంవల్ల నీవు జన్మించావు. కానీఅల్పా యుష్షునికిగా నిన్ను శివుడుమాకుఅనుగ్రహించాడు. నువ్వుపుట్టిననాటి నుండి ఈనాటి వరకు నిన్నుయమ భటులు కొనిపోకుండా ఏదో ఒక కోరిక కోరుతూ కాలక్షేపం చేసాను. ఈసారివస్తేవారికి ఏం చెప్పాలో నిన్ను ఎలా కాపాడుకోగలనో పాలుపోక దుఃఖిస్తున్నానని చెప్పింది తల్లి.

అమ్మా ! విచారించకు నాకు మామయ్యను తోడిస్తే కాశీకి వెళ్లివస్తాను. మృత్యుంజ యుని దర్శనంవల్ల చిరంజీవినై వర్థిల్లగలవాడను అని ఆమెకు ధైర్యం చెప్పాడు ఇంట ఒకతులసి మొక్కను పాతి అమ్మా దీని బాగోగులే నా యోగక్షేమాలు అని చెప్పి మేనమామతో కాశీకి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఒక రాజుగారి పూలతోటలో విశ్రాంతికై ఆగాడు. ఆతోటలో పూలుకోసుకుంటున్న రాజుకుమార్తె ఆమెచెలికత్తెలు రాజభవనానికి వెళ్లిపోతుం డగా వారిలోవారికి కలహముకలిగి ఒకరినొకరు ముండాయని తిట్టుకొనసాగిరి. చెలులారా! నాకీరాత్రి పెళ్లికానున్నది. మా తల్లిగారు నాకు శ్రావణ మంగళవారం నోము వాయనమియ్య బోతున్నది. నన్ను ముండ అనవద్దని చేత ఉన్న పువ్వుల్ని నేలపై పడవేచి అంతఃపురానికి వెళ్లిపోయింది ఆమె పారవేసిన పువ్వులు పైకి ఎగసి చెట్టుకొమ్మలకు అంటుకుపోయినవి. అదిచూచిన బ్రాహ్మణపుత్రుడు ఆమెమహత్యమునకు ఆశ్చర్యపడి ఆమెభార్యయైన బాగుండు నని లోలోన అనుకొనెను. అది చూచిన మేనమామ రాకుమార్తెపై మేనల్లుడునకు కాంక్ష కలిగెననిగమనించియాత్రకుపోవువారికి కాంతా కనముల కాంక్ష తగదని మందలించెను.

రాకుమార్తె వివాహం వేళ సమీపించినా పెళ్లివారు రావడం జరగలేదు. పెళ్లి కుమారునకు ఆరోగ్యంబాగుండనందున వివాహమునకు తరలి రాలేకున్నామని ఒక వర్తమానమును పంపించిరి. వివాహ సన్నాహములను ఘనముగా చేసుకున్న మహారాజు ఈ అవాంతరమును ఎంతగానో కలతచెంది అనుకున్న ముహూర్తమునకు కుమార్తె పెళ్లి చేయకపోవడం పరువు తక్కువగా నిర్ణయించుకుని యెరువు పెళ్లికొడుకుగా వచ్చుటకు అంగీకరించిన వారితో వివాహం జరిపించతలచి తోటలోని విప్ర కుమారుడ్ని చూచి మేనమామను ఒప్పించి యెరువు పెళ్లికొడుకుగా ఆ విప్రబాలకునితో వివాహం చేసారు. ఆనాటి రాత్రి రాకుమార్తె అతనికి పలహారములు పెట్టగా అతని వ్రేలి ఉంగరము జారిపడగా దానిని తీసి వ్రేలికి త్రొడుగుకుని జాగ్రత్తపర్చి నిద్రించింది. ఆ నిద్రలో ఆమెకు జగన్మాత సాక్షాత్కరించి కుమారీ! నీ భర్తకు ప్రాణగండమున్నది ఒక పాము కాటువేయగావచ్చును కాటువేయగా వచ్చుచున్న ఆ పామును శ్రావణ మంగళవారము వాయనముగా నీతల్లి నీకిచ్చిన కుండయందు పట్టి వాసినకట్టు నీకు అపాయము తప్పుతుందనిహెచ్చరించింది. ఆమాటలకు రాజకుమారి మెలకువ తెచ్చుకుని పామును వాయనపు కుండయందు పట్టుటకు అటకపై గల కుండను బ్రాహ్మణ బాలుని తొడలపై నిలచి అందుకొని పామును పట్టి వాసనకట్టి దానిని తమ పాన్పుదిగువనుంచెను.



తెల్లవారు ఝూమున బ్రాహ్మణ బాలుడ్ని మేనమామ మేల్కొల్పి కాశీకి తీసుకుని వెళ్లిపోయాడు. అటుపైకొన్నాళ్లకు అసలు పెళ్లివారురాగా వివాహసన్నాహములకు మహా రాజు పూనుకొనెను. అది తెలుసుకున్న రాజకుమారి అందుకు అంగీకరించలేదు. అది యెరువు పెళ్లికొడుకుతో చేసిన పెళ్లి లాంచనం మాత్రమే అది అసలుపెళ్లికానేకాదని వాదించెనుతండ్రి. యెరువోబరువో తాళికట్టిన అతడే నాభర్తయని పలికి తండ్రి చేయ దలచిన వివాహమునకుఅంగీకరించలేదు. అతడ్నికనుగొనడం కల్ల నిన్ను పెళ్లాడినవాడు పలానా అని నిదర్శనం చూపమన్నారు మహారాజు.

తండ్రీ ఒకసంవత్సరకాలం అన్నదానం, తాంబూల దానం చేసి నీకు నా భర్తను నిదర్శనగా చూపిస్తానన్నది. ఆమాట ప్రకారం అన్నదానం, తాంబూలదానం చేస్తూ విప్ర కుమారుని రాకకై నిరీక్షిస్తున్నది. కాశీకి వెళ్లిన విప్రకుమారుడు విశ్వేశ్వరుడు అన్నపూర్ణల దర్శనం చేసుకుని స్వగ్రామానికి తిరిగి వస్తూ రాకుమార్తెరాజ్యంమీదుగా వచ్చాడు. పూర్వంవలె పూతోటలోఆగి రాకుమార్తె చేయుదానవ్రతం గురించి విని వెళ్లి భోజనం చేసాడు. తాంబూలం అందుకుంటుండగా రాకుమార్తె అతని చేతిని పట్టుకుని ఇతడే నా భర్తయని పలికింది. అందుకు బుజువేమిటన్న తన తండ్రికి తన చేతిని గల ఉంగరాన్ని అతనివ్రేలికి తొడిగి ఇది ఆయన ఉంగరం పలహారం చేస్తున్న వేళలో జారిపడితే జాగ్రత్త పర్చాను. ఆరాత్రి ఈయనను కాటు వేయడానికి వస్తున్న సర్పాన్ని వాయనపు కుండలో పట్టి వాసినకట్టాను ఆ కుండను తీసుకోవడంలో అటక అందక మరియొక దారిలేక ఆయన తొడపై కాలుమోపి పైనగల కుండనందుకున్నాను. ఆయన తొడపైగల పంచెపై నిలచిన పసుపు జాడలు చూపించింది. వాసిన కుండను తెచ్చిమూతవిప్పి అందులోబంగారు పాముగామారిన పాముఅస్థిపంజరాన్నిచూపెట్టింది. పెద్దలు మహారాజుఅందరూ అంగీక రించి అతనివెంట ఆమెను అత్తవారింటికి సాగనంపారు. అత్తవారింట రాకుమార్తె శ్రావణ మంగళవారంల నోము నోచుకున్నది. భర్తకు గండం తొలగి పూర్ణాయుష్షు కలిగింది. కుమారునిపట్ల దుఃఖంతోకుమిలిపోయి కళ్లుకానక గుడ్డివారుగాఉన్న బ్రాహ్మణ దంపతులకు రాకుమార్తె శ్రావణమంగళవారం పిండికుందుల దీపాలపై పట్టిన కాటుకను వాళ్ల కన్నులకు కొంతవ్రాసింది వారికిచూపుకలిగింది. వారంతాఆనందంతోకలకాలం సుఖంగాజీవించారు. శ్రావణ మంగళవారం మహత్యాన్ని తెలుసుకున్న ఆదేశప్రజలు నోమును నోచుకుని హాయిగా జీవితాలను గడుపుకున్నారు.

**ఉద్యాపన :-** ఈ నోమును 5సంవత్సరాలు నోచుకుని కడపట ఉద్యాపన చెప్పాలి. మొదటి సంవత్సరం అయిదుగురు, 2వసంవత్సరం పదిమంది 3వ సంవత్సరంపదిహేను మంది, 4వ సంవత్సరం ఇరవైమంది, 5వ సంవత్సరము ఇరవైఅయిదుమంది పేరంటాళ్లకు శనగలువాయినమియ్యాలి. ఈ5సంవత్సరాలలో మొదటిఏడాది అయిదుఅరసోలలు, రెండవ ఏడాది అయిదుసోలలు మూడవ ఏడాది పదిహేను అరసోలలు నాల్గవ ఏడాది ఇరవై అరసోలలు అయిదవ ఏడాది ఇరువై అయిదు అరసోలలు శనగలను పేరంటాళ్లకు వాయనమియ్యాలి. అయిదొత్తుల పిండికుందుల జ్యోతులను వెలిగించి పిండికుందులను తానేఆరగించాలి. దీపాలవత్తికిపట్టిన కాటుకనుపేరంటాళ్లకళ్లకుపెట్టుకొనుటకుఅందించాలి.

ఆఖరున పెండ్లి దినమున పెండ్లి కుమార్తెకు క్రొత్తకుండలో 30 జోడుల అరిశలు ఉంచి కొత్తరవికలగుడ్డను వాసినగట్టి మట్టెలు మంగళసూత్రాలు ఉంచి అందించాలి.

## 2. శ్రావణ శుక్రవారము (వరలక్ష్మి వ్రత) నోము కథ

పార్వతి పరమేశ్వరులుసకలముని జనపరవేష్ఠితులై ఒకనాడు కైలాసగిరియందు లోక విశేషాలను ముచ్చటించుకొనుచున్నారు. ఆ సమయంలో పరమేశ్వరుని అంకతలా నగల జగదీశ్వరి పరమేశ్వరుడ్ని ఉద్దేశించి ప్రాణనాధా ! స్త్రీలు సుమంగళులుగా కలకాలం ఐశ్వర్యసంపన్నులై జీవించుటకువారాచరించవలసినవ్రతమును విన్నవించుడని సనియంగా కోరింది. అందుకా పరమేశ్వరుడు దేవీ! వరలక్ష్మీ వ్రతము స్త్రీలను సకలైశ్వర్య సంపన్నులను చేయు వ్రతము. సుమంగళులుగా సమస్త సౌభాగ్యములతో భూమిపైన సుఖాన్ని, పరమును ముక్తిపదాన్ని పొంది తరిస్తారు. దీనిని శ్రావణమాసంలో శుక్లపక్షాన పౌర్ణమికి ముందుగా వచ్చు శుక్రవారమునాడు నోము నోచుకోవాలన్నాడు.

మహేశ్వరా! స్త్రీల సౌభాగ్యమును గోరి తమరు శ్రావణ శుక్రవారము నోమును వివరించారు. ఈవ్రత విధానము, దానిని చేసి తరించిన వారెవరో తెలియజెప్పి కృతార్థులను చేయవలసినదని పార్వతీదేవి శివుడ్ని అడిగింది. పార్వతీ! ఈ వ్రత విధానాన్ని వ్రతకథను చెబుతాను సావధానంగా విను.

పూర్వకాలమందు కుండి నగరమను పట్టణమున చారుమతి అనబడు గుణవంతు రాలుండెడిది. ఒకనాడామెకు ఆదిలక్ష్మి స్వప్నమందు కనబడి సద్గుణశీలా చారుమతీ నీగుణములకు వినయ విధేయతలకు భక్తి శ్రద్ధలకు మెచ్చితిని. నీకు వలయు వరమును అనుగ్రహించవలెనన్న ఆలోచన కలిగినది. కనక నీవు శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చు శుక్రవారంవరలక్ష్మీవ్రతంచేయుము. అప్పుడునేను నీవుకోరిన కోర్కెలనుతీర్చెదను అనిచెప్పి అంతర్హితురాలయ్యింది. తక్షణమే చారుమతి మేల్కొని భర్తను లేపి స్వప్న వృత్తాంతమును భర్తకుతెలియజెప్పింది. అందులకాతడు మిక్కిలిఆనందించినవాడై భార్యను వరలక్ష్మీవ్రత మును చేయుటకుప్రోత్సహించాడు. ఈసంగతి విన్న నగర స్త్రీలు కొందరు తాము కూడా ఈ వ్రతమును చేసి తరించవలెనన్న భక్తితో శ్రావణ శుక్రవారము కొరకై వేచియున్నారు.

శ్రావణమాసంవచ్చింది. పౌర్ణమిముందు శుక్రవారం వేకువజామునే తలారా స్నానం చేసి ఇంటగల గదిని ఆవుపేడతో అలికి బియ్యంతో మండపం యేర్పరచింది. వరలక్ష్మీ దేవిని ఆవాహన చేసింది. తొమ్మిది నూలుపోగులతోరం కుడి ముంజేతికి కట్టుకున్నది. సాయంత్రం వరకు ఉపవాసమున్నది, క్షీర సాగరుని కూరిమి కుమార్తె, శ్రీహరి మనోహరిని, త్రైలోక్యకుటుంభిని, సమస్త దేవతాస్త్రీ స్వరూపిణియగు శ్రీలక్ష్మీదేవికి నానావిధ ఫలపుష్ప పానీయాదులతోపూజించినది. పాయసం నైవేద్యమును ధూపదీపాలతో నివేదించి దండ ప్రణామాలు, ప్రదక్షిణచేసింది. అంతలోఘల్లు, ఘల్లున కాలి అందియల సవ్వడి వినబడింది. క్రిందకు చూడగా కాలిఘజ్జలు అందెలు కనిపించాయి. భక్తిపారవశ్యంతో రెండవ ప్రదక్షిణ చేయగా నవరత్నఖచితకంకణాలు మూడవ ప్రదక్షిణ పూర్తిచేయగా నానావిధ స్వర్ణాభరణాలు కలిగాయి. చారుమతిచే వ్రతం చేయించిన విప్రునకు యథోచితంగా దక్షిణ తాంబూలాదు లిచ్చి ఆశీస్సులను అందుకున్నది. వ్రత ప్రసాదాన్ని బంధుమిత్రాదులకు పెట్టి, తానూభుజిం చినది. ఇదే క్రమంలో వ్రతమాచరించిన స్త్రీలు అందరూ వరలక్ష్మీ దేవికృపకు పాత్రులై తరించారు. బంధుజనులంతా చారుమతిని ప్రస్తుతించారు. ఆనాటినుండి లోకంలో స్త్రీలు



శ్రావణ శుక్రవారం నోమును నోచుకుంటూ వరలక్ష్మీ దయను పొంది సమస్త సంపదలతో విజయాలతో వర్ధిల్లుతున్నారని సదాశివుడు జగదీశ్వరి పార్వతీదేవికి చెప్పాడు.

**ఉద్యాపన :-** శ్రావణ శుద్ధపౌర్ణమికి ముందువచ్చు శుక్రవారం ఆచరించవలసినట్టిది ఈ వరలక్ష్మీ వ్రతము. గృహంలో ఈశాన్యంవైపు గది శుభ్రంచేసి అందు బియ్యంతో మండపం యేర్పరచి అమ్మవారిని ప్రతిష్టించి తొమ్మిది నూలుపోగుల దారంతో తోరమును కుడి మణికట్టుకు కట్టుకుని ఫలపుష్పాదులతో పూజించాలి. ధూప దీపనైవేద్యాదులు సమర్పించి ప్రదక్షిణ నమస్కారాలు చేసి సాష్టాంగ దండప్రణామం చేసి ప్రసాదాన్ని తీసుకుని తోటివారికి ప్రసాదం ఇవ్వాలి. విప్రునకు దక్షిణ తాంబూలా దులిచ్చి నమస్కరించి ఆశీస్సులు పొందాలి. పేరంటాళ్లకు పసుపు, కుంకుమ దక్షిణ తాంబూలాదులిచ్చి ఆతదుపరి తాను భుజించాలి. వ్రతం తప్పినా భక్తి చలించరాదు.

## 3. శ్రావణపౌర్ణమి నోము కథ

పూర్వకాలంలో ఒక ఊరిలో ఒక సంపన్న గృహస్తుడుండేవాడు. అతనికి ఒక్కగానొక్క కుమారుడు దేశ దేశాలు తిరిగి రూపవతి, గుణవతి అయిన కన్యను అన్వేషించి ఆమెతో తన కుమారునకిచ్చి వివాహంచేసాడు. అదేమోగాని ఆ కుమారుడు తన భార్యను సరిగా చూసేవాడుకాదు కించిత్తైనా అనురాగంప్రదర్శించేవాడు కాదు. అందుకాకోడలు ఎంతగానో కుమిలిపోయేది. అత్తమామలతోమొరపెట్టుకునేది. గృహస్థధర్మాలను గురించి వాళ్ళ తల్లి తండ్రులు ఎంతగా చెప్పినా కుమారుని ప్రవర్తనలో ఏవిధమైన మార్పుకలుగలేదు. ఇందుకు కారణమేమిటో ఏవిధంగా పరిష్కరించాలో అతని తల్లి తండ్రులు ఎంతగా ఆలోచించినా మార్గంతొచలేదు.కాలంగడిచిపోతున్నది. ఒకానొక శుభదినాన వారింటికి జ్ఞానసంపన్నుడైన మహాయోగి ఒకాయన రావడంజరిగింది. ఆయనకు తమ కుమారుని ప్రవర్తనను విన్నవిం చారు. ఏదైనామార్గాన్ని ఉపదేశించమనికోరుకున్నారా జననీజనకులు. అందుకా యోగీశ్వ రుడు ఆలోచించి మీకోడలు చేతశ్రావణపౌర్ణమి నోమునోయించండి ఆవ్రతప్రభావంవల్ల ఆమె కాపురం కుదుటపడుతుందని చెప్పాడు. ఆకోడలిచేత శ్రావణపౌర్ణమి నోము నోయించారు. వ్రతఫలితంగా ఆమె, భర్త అనురాగాన్ని పొంది సుఖించింది.

**ఉద్యాపన :-** శ్రావణపౌర్ణమినాడు ఉదయాన్నేనదీస్నానంచేసి గణపతినిఆరాధించి ఇంట మండపంయేర్పరచిజగత్పితరులైనశివపార్వతులనుప్రతిష్టించుకుని దీపారాధనచేసి గోత్ర నామాలుచెప్పుకుని ధూప దీప నైవేద్య నారికేళ తాంబూలాదులు సమర్పించి పూజించాలి.

## 4. బాలాదివారం నోము కథ

పూర్వకాలంలోఒకానొకగ్రామంలోనిరుపేదదంపతులుండేవారు.దైవాను గ్రహం వలన ఆ కుటుంబానికి ఏవిధమైన లోటు ఉండేదికాదు. వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. కుమారుడికి వివాహం జరిగింది. కోడలు కాపురానికి వచ్చింది. కుమార్తెకు ఇంకా వివాహంకాలేదు. వారంతా ఎంతోఆనందంగా అన్యోన్యంగాజీవిస్తుండేవారు. వీరి ఇంటికి ప్రతినిత్యం ఒకవిప్రుడు ఆయవారానికివస్తుండేవాడు. కోడలు కూతురు ఆ బ్రాహ్మ ణునికి జతగా భిక్షం ఇస్తుండేవాడు. ఆయవారం అందుకొని ఆభూసురుడు కోడల్ని

సౌభాగ్యంతో వర్ధిల్లుఅని కూతుర్ని గంగానదీ స్నానఫలసిద్ధిరస్తని ఆశీర్వదిస్తుండేవాడు. ఈతేడాఏమిటో ఎంతగాఆలోచించినా ఆవదినా మరదళ్లుకు తెలిసేదికాదు. ఒకర్ని ఒకలాగా మరొకర్ని ఇంకొకలాభిక్షఇచ్చినవార్ని వేరు వేరు విధాలుగా ఆశీర్వదించడంలోని ఆంతర్యం తెలుసుకోవాలన్న ఆలోచన ఆవదినా ఆడపడుచులఎదల్లో గాఢంగా నాటుకున్నది. అదేమిటి అని ఆవిప్రుడ్ని అడిగేచొరవసంస్కారం లేకవాళ్లు తమ పెద్దవారయిన దంపతులకీ విషయం చెప్పి కారణమేమిటనిప్రశ్నించారు. ఆవృద్ధులకుసైతం ఆంతర్యంతెలియరాలేదు. ఆమర్నాడు ఆ విప్రుడు ఆయవారానికి వచ్చి ఆయవారం అందుకుని ఆపడుచులను యధాప్రకారం ఆశీర్వదించగా తల్లిదండ్రులు ఏమిటిదిస్వామిమాకోడల్ని ఒకలాగమాకు మార్తెను ఒకలాగా దీవిస్తున్నారు. ఎందువల్ల ఇలా వ్యత్యాసంగా ఆశీర్వదిస్తున్నారు అని ప్రశ్నించారు.

వారిప్రశ్నలకు ఆభూసురుడు చిన్నగానవ్వి పుణ్యదంపతులారా! వారి శ్రేయస్సుకోరే వారిని నేనిలా ఆశీర్వదిస్తున్నాను అన్నాడు. అలానే అయితే వారిని ఒక్కలాగనే ఆశీర్వదించ వచ్చును గదా అని మళ్లీ ప్రశ్నించారా జననీజనకులు, అవును ఒక్కలాగనే ఆశీర్వదించ వచ్చును. మీ కోడలువలె మీ కుమార్తె కూడా సౌభాగ్యవతిగా వర్ధిల్లాలని అందుకు ఆ కన్యకు గంగానదీ స్నానసిద్ధి కలగాలని ఆశీర్వదిస్తున్నాను అన్నాడు. స్వామిమీమాటల్లో అర్ధమేమిటో గ్రహించలేకపోతున్నాం. మాయందు అనుగ్రహముంచి వివరంగా చెప్పి మాసంశయాన్ని నివృత్తిచెయ్యండి అనిఅడిగారు ఆ దంపతులు. మీ అమ్మాయికి వైదవ్యప్రాప్తి ఉన్నది. అది తొలగాలంటే ఆమెకు గంగానదీ స్నానం సిద్ధించాలి. అదే నా ఆశీర్వచనంలోని వ్యత్యాసానికి గల ఆంతర్యం అని వివరించాడు ఆ బ్రాహ్మణుడు. విప్రోత్తమా! మీ మనస్సు తెలియక మిమ్మల్ని శంకించాము. మా బిడ్డకు గంగానది స్నానం సిద్ధించాలంటే మేము ఏమి చెయ్యాలో సెలవిచ్చి మమ్మల్ని ఉద్ధరించండి అని ప్రార్థించారు. కుమార్తె వైధవ్యాన్ని చూడలేమని వాపోయారు. భవిష్యత్తు తెలిసిన జ్ఞానసంపన్నులు తమరే తగిన ఉపాయమును చెప్పి మమ్మందరిని ఉద్ధరించవలసినదని మొత్తుకున్నారు ఆ దంపతులు.

అందుకా విప్రుడు ప్రసన్నచిత్తుడై బ్రహ్మవ్రాతతప్పనిది. అయినను స్త్రీలు నోచునోములు వారిని సౌభాగ్యవంతులుగా చేయగల మహిమ కలిగినవిగా రాణిస్తుంటాయనునది నిజము. మీరు మీ కుమార్తెకు వివాహము చేసిన కొద్ది రోజులకే ఆమె భర్త చనిపోవును. వాని శవమును పసుపుగుడ్డల్లో భద్రపర్చి మీరు మీ అమ్మాయిని గంగానది స్నానానికి కాశీకి తీసుకుని వెళ్లండి. మార్గమధ్యమందు మీకు ముందు వెడుతున్న ఒక వృద్ధురాలి చీర చెంగునుండి పసుపు కుంకుమ పొట్లాలు జారిపడిపోవును. వాటిని మీ అమ్మాయిచేత తీయించి స్నానానికి గంగానదికి తరలివెళ్లండి అక్కడ ఆ వృద్ధురాలు తనచెంగున పసుపు, కుంకుమ పొట్లాలు కనబడక ఎవరికైనా దొరికినవా యనిఅడుగును, మీ కుమార్తెచే తీసి భద్రపర్చిన ఆపొట్లాలను ఆముదుసలి ముత్తైదువకు యిప్పించండి, అందుకామె సంతృప్తి చెంది ఆ పొట్లాలలోని పసుపు కుంకుమలను కొద్దికొద్దిగా మీ కుమార్తెకు ఇచ్చును. ఆ అనంతరం మీఅమ్మాయిచే గంగానదిస్నానంచేయించండి. ఆవృద్ధురాలిచ్చినపసుపు, కుంకుమలనుమీఅమ్మాయిచేత వినియోగింప జేయండి. పసుపువ్రాసుకుని స్నానంచేసి నుదుట కుంకుమ పెట్టుకున్న మీ అమ్మాయితో విఘ్నేశ్వరుడ్ని అన్నపూర్ణను, కాలభైరవుడ్ని దర్శింప జేసి స్వగ్రామానికి తిరిగిరండి.



స్వగ్రామానికి వచ్చిన వెంటనే ఆవుపాలతో క్షీరాన్నమును మీకుమార్తెచే వండించి మాడుపట్టని ఆ పరమాన్నమును ఒక ముత్తైదువునకు ఇప్పించండి. ఆమె సరసను కూర్చుని మీ కుమార్తె కూడా భోజనం చేసి ఆ తదుపరి మీ శక్తిమేరకు ఆ ముత్తైదువునకు చీర, తాంబూలం దక్షిణ ఇచ్చి ఆమె కాళ్లకు మ్రొక్కించండి. ఆమె మీ కుమార్తెను ఆశీర్వదిస్తుంది. అందువల్ల అల్లుడు బ్రతుకుతాడు. మీ అమ్మాయి సుమంగళి కాగలుగుతుంది. ఆ తదుపరి మూడు ఆదివారాలు మీ అమ్మాయిచేత చేయించండి. ఇందువల్ల పూర్వజన్మ కర్మఫలం తొలగి దీర్ఘసుమంగళియై వర్ధిల్లుతుంది అని చెప్పి వెళ్లిపోయాడా విప్రుడు.

అనతి కాలంలోనే ఆ దంపతులు తమ కుమార్తెకు వివాహం చేశారు. వివాహం జరిగిన నాలుగునాళ్లకే వరుడు మరణించారు. ఆ మృతదేహాన్ని పసుపు బట్టలలో చుట్టబెట్టి భద్రంగా ఉంచి కుమార్తెను తీసుకుని కాశీకి బయలుదేరారు. మార్గమధ్యంలో ఆ విప్రుడు చెప్పిన ప్రకారం తన కుమార్తెకు పసుపు, కుంకుమ, పొట్లాలు దొరినినవి. అవి తీసుకుని గంగానదికి చేరి అక్కడ తనకుమార్తెగంగానది స్నానం చేయబోతున్న సమయంలో ఒక వృద్ధురాలు నా పసుపు, కుంకుమ పోయింది, ఎవరికైనా దొరికిందా అని వాకబు చేస్తుంటే వీరి కుమార్తె తనకు మార్గమధ్యంలో దొరికిన పసుపు కుంకుమ పొట్లాలను అందించింది. ఆ ముదుసలి ముత్తైదువు ఆనందించి ఆ పొట్లాలలోని పసుపు కుంకుమ కొంత ఆమెకిచ్చి సుమంగళివై వర్ధిల్లాలి అని ఆశీర్వదించింది. ఆ ముత్తైదువుతో గంగాస్నానం చేసింది. ఆమె ఇచ్చిన పసుపు వ్రాసుకుంది. కుంకుమ నుదుటను దిద్దుకుని ఆ ముత్తైదువుకు పాదాభివందనం చేసింది. వినాయకుని గుడికి వెళ్లి ఆపదలు కాయమని వేడుకున్నది. అన్నపూర్ణ మందిరానికి వెళ్లి సుఖప్రశాంతులు అనుగ్రహించమని వేడుకున్నది. కాలభైరవుని దర్శించుకుని పూర్ణాయుష్షులతో వర్ధిల్లజేయమని వేడుకుని స్వగ్రామానికి మరలివచ్చింది.

శుచిర్భూతయై భక్తిశ్రద్ధలతో గోక్షీరాలతో పరమాన్నాన్ని అడుగంటకుండా తెట్టుకట్టకుండా వండింది. ముత్తైదువును పిలిచి క్షీరాన్నాన్ని పెట్టి ఆమె సరసన కూర్చుని తానూ క్షీరాన్నాన్ని భుజించి దక్షిణతాంబూలాదులతోచీర రవికఇచ్చి నమస్కరించింది. దీర్ఘసుమంగళీభవ అని ఆ వృద్ధురాలు ఆశీర్వదించింది. ఆ వెంటనే పసుపు గుడ్డల్లో నిర్జీవుడై ఉన్న ఆమె భర్త నిద్ర మేల్కొన్న వానివలె సజీవుడయ్యాడు.

అనంతరం ఆక్రమంలో మూడుఆదివారాలు క్షీరాన్నాన్ని వండి ముత్తైదువులకు పెట్టి దక్షిణతాంబూలాలిచ్చి ఆమె ఆశీస్సులను పొందింది. ఇలా బాలాదివారం నోము నోచినందు వల్ల ఆమె సౌభాగ్యసంపదలతో నిరంతరం ఆనందంతో జీవించింది.

## 5. భాగ్యాదివారం నోము కథ

పూర్వకాలంలో ఒకానొక రాజ్యాన్ని పరిపాలిస్తున్న మహారాజుకు ఒక కుమార్తె ఆమెపేరు భాగ్యలక్ష్మి. ఆ మహారాజు మంత్రికొక కుమార్తె ఆమెపేరు సుబ్బలక్ష్మి. వీరిద్దరూ ఎంతోఅన్యోన్యంగాఉండేవారు. వీరిద్దరిచేత వీరిపెద్దలుభాగ్యాదివారం నోము నోయించారు. మంత్రి కుమార్తె శ్రద్ధాభక్తులతో నోము నోచింది. రాజు కుమార్తె నోముపట్ల భక్తిశ్రద్ధలు లేకుండా నోమును పెద్దలు నోయమన్నారన్న ఇదితో నిర్లక్ష్యంగా చేసింది. నోమునోచిన ఫలితంగా మంత్రికుమార్తెకు సిరిసంపదలు సుఖభోగాలు కలిగాయి. రాకుమార్తెకు ఇవేవి కలగలేదు. అష్టకష్టాలు అనుభవిస్తూ నా అన్నవారెవ్వరూ ఆదరించక అడవులపాలయ్యింది.

అడవుల వెంబడి తిరుగుతున్న ఆమెను పార్వతీపరమేశ్వరులు చూచి వృద్ధదంపతుల వేషంలో ఆమెదగ్గరకువచ్చికుశలప్రశ్నలువేశారు. బిడ్డానువ్వు భాగ్యాదివారం నోమును నిర్లక్ష్యంగాచేసి అపరాధంచేశావు. అందువల్లనే నీకీదుర్భర పరిస్థితి. ఇప్పుడైనా భక్తిశ్రద్ధలతో భాగ్యాదివారంనోమును ఆచరించునీకష్టాలు తొలగిపోతాయి. ఇహపరాలలో సుఖపడతావు అని చెప్పి అదృశ్యమయ్యారు శివపార్వతులు. తన తప్పును తెలుసుకున్న రాజకుమార్తె భాగ్యలక్ష్మి గురికుదుర్చుకున్నది. స్థిమితపడి నగరానికి చేరుకున్నది. ఏలోపము లేకుండా భక్తిశ్రద్ధలతో భాగ్యాదివారం నోము నోచుకుని ఉద్యాపన చెప్పుకున్నది.

**ఉద్యాపన :-** పట్టుగుడ్డతో అంచుకుట్టని రవికలగుడ్డను చేటలో పరచాలి. నల్లపూసలు మంగళసూత్రం పసుపు, కుంకుమ, దక్షిణతాంబూలం ఆ చేటలో పరచిన రవికలగుడ్డపై ఉంచి మరొకచేటతోమూయాలి. దానిని ఒకముత్తైదువునకు వాయనమియ్యాలి. సంవత్సర మంతా ప్రతీఆదివారం ఈనోమునోచి ఈ కథను చెప్పుకుని అక్షితలు శిరస్సున వేసుకోవాలి. ఒకపూటభోజనంచెయ్యాలి.రెండవపూటఫలహారం తీసుకోవాలి. ఈ వ్రతానికి భక్తిప్రధానం. అలా భక్తితో శ్రద్ధగా ఈ నోమును నోచి రాజకుమార్తె భాగ్యలక్ష్మి ఇహంలో భోగాన్ని సుఖాన్ని పరంలో ముక్తిని పొందింది.

## 6. తరగని ఆదివారము నోము కథ

పూర్వకాలంలో రాజుభార్య మంత్రిభార్య కలసి తరగని ఆదివారముల నోము నోచుకున్నారు. రాణి అంతంతమాత్రపు శ్రద్ధతో నోచుకున్నది. మంత్రి భార్య శ్రద్ధగా ఎంతోభక్తితో నియమనిష్ఠలతోనోచుకున్నది. నవనిధులతోనవరత్నాలవంటి తొమ్మండుగురు కుమారులతో మంత్రి భార్య సుఖప్రశాంతులతో జీవిస్తున్నది. రాణీకి బిడ్డలు కలగలేదు. స్థిమితం చిక్కలేదు. మంత్రి భార్యపట్లరాణీలో అసూయఆవరించింది. తనకులేనిబిడ్డలు మంత్రి భార్యకు ఉండ రాదన్న ఈర్ష్య కలిగింది. ఒకనాడు రాత్రి మంత్రికుమారులను అందరిని తన ఇంటికి పిలిచి తలలు నరికించింది. మొండాలను ఒకపెట్టెలో పెట్టి మంత్రి భార్యకు పంపించింది. భటులు తెచ్చిన ఆ పెట్టెను కానుకగా తలచి మంత్రిభార్య తెరచి చూచింది. అందులో కుమారులంతా సజీవులై బయటకు వచ్చారు. ఇదిచూచిన భటులు ఈ విషయాన్ని రాణీకి విన్నవించారు. అదేమిటో తెలుసుకోవాలని రాణి మంత్రిభార్య ఇంటికి వచ్చింది. మనమిద్దరము ఏక కాలంలో తరగని ఆదివారం నోము నోచామకదా నీకు బిడ్డలు కలిగారు. మరి నాకెందువల్ల పుట్టలేదని మంత్రిభార్యను ప్రశ్నించింది. మహారాణీ నీవు వ్రతం పట్ల సరియగు దీక్షను వహించక నిర్లక్ష్యంగా చేశావు. వ్రత నియమాలను పాటించలేదు. నీ అశ్రద్ధకారణంగా భగవదనుగ్రహం నీకు లోపించింది. తప్పు తెలుసుకుని వ్రతాన్ని శ్రద్ధగా భక్తిగా చెయ్యవలసిందని చెప్పి మహారాణీచేత వ్రతాన్ని నియమానుసారం చేయించింది.

**ఉద్యాపన :-** ఈతరగని ఆదివారం నోము నోయువారు కూరలు తరగరాదు. తరిగిన కూరలుతినరాదు. తలంటుస్నానంచేసి 11కొబ్బరికాయలు 11కాసులు 1 చీర, 1 రవికెల గుడ్డ దక్షిణ తాంబూలాలు వాయనమివ్వాలి. ఒక్కపూటే భోజనం చేసి రాత్రులు ఫలహారం తీసుకోవాలి. ఇలాక్రమంతప్పకుండా సంవత్సరకాలం భక్తితో ప్రతిఆదివారం ఈనోమునోచుకోవాలి. రాజుభార్యఈప్రకారం చేసి సిరిసంపదలు సంతానం పొందింది.



## 7. పూర్ణాదివారం నోము కథ

పూర్వకాలంలో ఒక రాజకుమార్తె గర్భశోకముతో దుఃఖపడుతుండేది. ఆమెకు కలిగిన బిడ్డలెవ్వరూముచ్చటదీరా నాలుగు కాలాలవరకైనాజీవించేవారుకాదు. పురిటి లోనే చనిపోతుండేవారు. ఈ పుత్రశోకాన్ని భరించలేక అడవుల వెంబడి దిక్కుతోచక తిరుగుతుండేది. ఒకానొకరోజున పార్వతీపరమేశ్వరులు ఆకాశమార్గమున లోకసంచారం చేస్తూ ఈరాజకుమారి తిరుగుతున్న ప్రాంతం మీదుగావెళుతూ ఈమెను చూచి జాలిపడి క్రిందకుదిగి ఆమెవద్దకు వచ్చారు. బిడ్డా! ఏమి నీదుఃఖం? ఎందుకిలా తిరుగుతున్నావని ప్రశ్నించారు. అందుకామె మీరునాఆర్తితీర్చగలరా! నన్నుఉద్ధరించగలరా! నాప్రారబ్ధముకొద్దీదుఃఖిస్తున్నాను. పుట్టినపురిటికాలంలోనే చచ్చిపోతున్న నాబిడ్డలను గురించిన దుఃఖమే నన్నిలా వేధిస్తున్నదని పార్వతీపరమేశ్వరులకు చెప్పుకున్నది.

పడతీ దుఃఖించకు పురాకృతకర్మ ఫలితమును అనుభవించుట ఎవరికైనను తరముకాదు. పూర్వజన్మమందు పూర్ణాదివారముల నోమునుఉల్లంఘించినందువల్లనే నీవీజన్మలో ఇలాశోకిస్తున్నావు. పుష్యమాసంలో ఈనోమునునోచుకున్న వారికి అనంతమైన సుఖభోగాలు సంతోషము, సంతానముకలుగును నీవుపూర్ణాదివారమునోము నోచుకో మేలు కలుగుతుందని చెప్పి పార్వతీ పరమేశ్వరులు అదృశ్యమయ్యారు. వారి మాటలయందు గురిని యేర్పరచుకుని ఆరాజకుమార్తె పూర్ణాదివారం నోమును ఆదివారం రోజున సంవత్సరకాలం అత్యంత భక్తి శ్రద్ధలతో చేసింది. ఉదయమే లేచి తలకుస్నానం చేసింది శుచిగా మడిగా పూజచేసి ఆపూటఉపవాసముండి సాయంత్రం పూట ఫలహారం తీసుకుని భక్తితో ఎంతో శ్రద్ధగా పూజచేసింది. పుష్యమి ఆదివారం రోజున క్షీరాన్నం పిండివంటలు వండివార్చి నివేదించింది. ఒక ముత్తయిదువకు దక్షిణ తాంబూలాదులిచ్చి భోజనం పెట్టి ఆ తదుపరి తాను ఆరగించింది. అలాచేసినందువల్ల ఆమెబాధలుతొలగిపోయాయి. దుఃఖంనశించిపోయింది. ఆయుష్మగల బిడ్డలు కలిగారు. జీవితాంతంసుఖ సంతోషాలను అనుభవించి అంత్యమందు పరమ పథాన్ని చేరుకున్నది.

## 8. అన్నము ముట్టని ఆదివారం నోము కథ

ఒకానొక దినమున పార్వతీ పరమేశ్వరులు కైలాసగిరిపై ప్రశాంతంగా కూర్చుని ఇష్టాగోష్ఠిలో అనేక విషయాలను ముచ్చటించుకుంటున్నారు. ఆ సమయంలో పార్వతి పరమేశ్వరుడ్ని ఉద్దేశించి ప్రాణనాథా! ఏ కారణం వల్ల స్త్రీలు నెలకు నాలుగు రోజులు భర్తను అంటకుండా దూరంగా ఉండడం జరుగుతున్నది వివరించవలసినదిగా ప్రార్థించింది పార్వతి. పూర్వకాలంలో ఇంద్రుడు వృత్రాసురిని సంహరించాడు. అందువల్ల ఇంద్రునకు బ్రహ్మహత్యాదోషం అంటింది. అంతటి ఇంద్రుడు ఆ దోషమును ఎట్లు నివారణ చేసుకొనవలెనో తెలియక విష్ణువునకు నివారణోపాయమును చెప్పవలసినదని ప్రార్థించాడు. అంతట శ్రీ మహావిష్ణువు ఆ దోషమును నాలుగు సమభాగములు చేసి ఒక భాగమును భూమికి, రెండవభాగమును వృక్షములకు, మూడవ భాగమును స్త్రీలకు, నాల్గవ భాగమును లోకులకు ఇచ్చెను. ఈకారణం వలన స్త్రీలు నెలకు ఒక పర్యాయము భర్తలకు దూరముగా ఉండుట

తటస్థించింది. అట్లుండక అలక్ష్యము చేసి ఆ అంటును ఇంటకలుపు స్త్రీలకు ఆ పాపము వ్యాధిరూపమున దేహమున పరిణమించుచుండునని సదాశివుడు పార్వతికి వివరించెను.

నాథా! ఆ పాపమును స్త్రీలు ఎట్లు పోగొట్టుకోగలుగుదురని ప్రశ్నించగా అతివలు అన్నముముట్టని ఆదివారంనోమును నోచుకొనవలెనని ఆవ్రతవిధిని వివరించెను.

పార్వతీ పూర్వం విష్ణుశర్మయను సకలశాస్త్ర సంపన్నుడైన విప్రుడొక డుండెడివాడు. అతనికి ఏడుగురు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉండెడివారు. వారందరికి విష్ణుశర్మ వివాహములు చేశాడు. వారిలో చివరిదైన రెండవ కుమార్తె మంచి అనురాగ సంపన్నురాలు భర్తను నిరంతరము వదలక ఆతనితోడే జీవితముగా కాలము గడుపుచుండెడిది. ఆమె ఇంటికి యోగక్షేమములు తెలుసుకొన తండ్రి రాగా కుమార్తె తమకు వివాహమై చాలా కాలమైనను తమకు సంతానము లేకపోవుటకు హేతువేమై ఉండునని ప్రశ్నించెను. అందుకా తండ్రి ఆమె సంసార జీవితమును గూర్చి అడిగి తెలుసుకొనగా ఆమె భర్తను అమావాస్య పౌర్ణమి తిథులందు సైతమును విడువక కాపురమును చేయుచున్న సంగతి తెలుసుకున్నాడు. అది విని తండ్రి ఎంతగానో విచారించాడు. కొంత కాలానికి ఆ కుమార్తెకు ఆరోగ్యము చెడి స్వస్థత కోల్పోయినది. తండ్రి నాకేల ఈ దుస్థితి, నేనిక గొడ్రాలినేనా, మాతృమూర్తిని కాలేని నా స్త్రీ జన్మ వృథాకదా అని వాపోయింది.

కుమార్తె ఆవేదనను గ్రహించిన విష్ణుశర్మ దీర్ఘంగా ఆలోచించి తన ఆరాధ్యమూర్తియైన సూర్యనారాయణుడే తగినతరుణోపాయాన్ని అనుగ్రహించగలడు అనినిశ్చయించుకున్నాడు. సూర్యనారాయణమూర్తిని నిష్ఠతో ఆరాదించాడు. సూర్యనారాయణమూర్తి ప్రసన్నుడై ఓయీ! విష్ణుశర్మా నీ మనోగతాన్ని తెలుసుకున్నాను. నేను చెప్పబోవు దానిని శ్రద్ధగా విని ఆ ప్రకారం చెయ్యి అనిఅభయంఇచ్చాడు. ఈగ్రామంలోసోమిదేవమ్మ అను పుణ్యాత్మురాలు న్నది. ఆమెప్రతీఏటా మూడువందల అరవైనోములు నోచుకొను ముత్తైదువు ఆమె మహాపతి వ్రత దేవతాభక్తురాలు నిరంతరం పుణ్యకార్యాలతో కాలం గడుపు పుణ్యాత్మురాలు. ఆమె వద్దకు వెళ్లు నీకుమార్తె సంగతంతాచెప్పు ఆమెచేసిన అన్నము ముట్టని ఆదివారం నోము ఫలమును కొంత తనకిమ్మని నీ కుమార్తెచేత అడిగించుము అని ఆదేశించాడు సూర్యభగవానుడు. ఆమె ఆదరిస్తుందా అని ప్రశ్నించాడు విష్ణుశర్మ. ఓయీ! ఆమె కడుపుణ్యాత్మురాలు తప్పక నీకుమార్తె కోరికను నెరవేరుస్తుంది. అందువల్ల ఆమె అనారోగ్యం తొలగిపోతుంది. నీ కూతురు తరించగల ఉపాయమేదైనా చెప్పమని ఆమెను వేడుకోండి ఆమె కరుణిస్తుంది అనిచెప్పాడు సూర్యభగవానుడు. నేను నా రోగిష్టి కూతుర్ని తీసుకుని ఆమె ఇంటికి ఎట్లు వెళ్లగలనని ప్రశ్నించాడు. ఓయీ! నీకాభయమక్కర్లేదు. రేపటిరోజున అంగడివీధియందు నిలబడినచో ఆమెయే వచ్చి నిన్ను తీసుకుని వెళ్లగలదు అని చెప్పెను.

ఆ ప్రకారము విష్ణుశర్మ అంగడి వీధియందు నిలబడియుండగా సోమిదేవమ్మ తను చేయు అన్నముముట్టని ఆదివారమునోమునకు 12 మంది బ్రాహ్మణుల ఆరాధనకు ఒక బ్రాహ్మణుడు తక్కువైనందున వానిని వెతుకుచూ అంగడి వీధికి వచ్చి విష్ణుశర్మను చూచి ఆహ్వానించింది. వెంట ఇంటికి తీసుకువెళ్లి అక్కడున్న బ్రాహ్మణులతోపాటు విష్ణుశర్మకు కూడా వడ్డనచేసింది. ఔపోశన సమయంలో విప్రుడు తనకూతురికిఒకఆదివారం నోముఫలి తాన్నిధారపోసి కాపాడవలసిందని కోరుచున్నాడు. పుణ్యాత్మురాలు కరుణామయురాలైన



సోమిదేవమ్మ విష్ణుశర్మ కోరిన ప్రకారం వ్రతఫలాన్ని ధారపోసింది. విష్ణుశర్మ కుమార్తెకు పూర్ణఆరోగ్యం కలిగింది. ఆ తర్వాత ఆమె వివరించిన ప్రకారం తన కుమార్తెచేత ఆపదలేని ఆదివారంనోమును క్రమం తప్పకుండా శ్రద్ధా భక్తులతో విధి విధానాల ప్రకారం చేయించాడు. అందువల్లఆమె సంపూర్ణ ఆరోగ్యముతో సత్సంతానముతో సకలైశ్వర్యాలతోవర్ధిల్లింది.

**ఉద్యాపన :-** ఉదయాన్నే తలస్నానం చేసి, గృహోత్తర భాగాన మండపం యేర్పర్చవలెను. ఆమండపంపై సూర్యభగవానుని 12 స్థానాలలోప్రతిష్ఠించాలి.పన్నెండుపద్మాలను అలంకరించాలి. పట్టు పీతాంబరాలు సూర్యభగవానునికి సమర్పించాలి. ఆవుపాలతో పొంగలి చేసి నైవేద్యం సమర్పించాలి. వృద్ధస్త్రీలు 18 మాసాలు ప్రౌఢస్త్రీలు 36 మాసాలు ఈనోమునుచెయ్యాలి. ఆదివారములుస్త్రీలు అన్నమును స్వీకరించక సూర్యభగవానునికి నివేదించాలి. నియమానుసారం వ్రతం చేసుకుని 12 మంది బ్రాహ్మణులకు పంచభక్ష్య పరమాన్నములతో భోజనమును పెట్టి ఫలపుష్ప తాంబూలాది దక్షిణలతో వారిని సత్కరించవలెను. ఈ నోముకు ఏకాగ్రత భక్తి విశ్వాసములు చాలా ముఖ్యము.

## 9. మాఘపు ఆదివారము నోముకథ

పూర్వం ఒక గ్రామంలో లక్ష్మీదేవమ్మ అనేసద్గుణరాశిఉండేది. కుమారులు కుమార్తెలతో ఎంతోభక్తితో పూజాపునస్కారాలు చేసుకుంటూజీవిస్తుండేది. ఒక ఏడాది మాఘమాసం రావడంతో పౌర్ణమికి ముందువచ్చే ఆదివారంనాడు అభ్యంగన స్నానంచేసి మాఘపు ఆదివారము నోము నోచుకున్నది. పూజానంతరం అక్షింతలు చేత్తో పట్టుకుని కుమారులను పిలిచి బిడ్డలారా! మాఘపు ఆదివారం నోముకథను చెబుతాను వినవలసింది అన్నది. అందుకామె కుమారులు అమ్మా మేము రాజుగారి సభకు వెళ్లవలసినసమయంమించి పోతున్నదని చెప్పివెళ్లిపోయారు. రాజసభ ప్రారంభమైపోయినందువల్ల ఆమె కుమారులు వేరుగా ఆసనములలో కూర్చుండవలసి వచ్చింది. మన్ననలభించకపోవడానికి తాము తమ తల్లి చెబుతున్న మాఘపు ఆదివారం కథ వినకపోవడంవల్లనే అని విచారించారు.

తనమనుమలను పిలిచి లక్ష్మీదేవమ్మ మాఘపు ఆదివారం కథ చెబుతాను వినమన్నది. వాళ్లు తమకు బడికి వెళ్లువేళ అయినదని పలికి వెళ్లిపోయారు. ఆలస్యముగా వచ్చితిరని వాళ్లనుపంతులుకొట్టెను. కథనువిననందువల్ల కలిగిన కష్టమని ఆ మనుమలు విచారించిరి.

లక్ష్మీదేవమ్మ నీళ్లాటరేవు వద్దకువెళ్లి అక్కడున్న పడతులను కథ వినుటకు రమ్మనమని కోరింది. మాకు తీరికలేదని నీటి కడవను తలనెత్తుకుని వెళ్లిపోయారు. మార్గమధ్యమందు కడవలు పగిలి నీళ్లు వొలిగిపోయాయి. మాఘపు ఆదివారం కథ వినుటకు తీరిక లేదన్నందుకు కలిగిన నష్టమని వాపోయారు.

నీళ్లాట రేవునుండి వస్తూ లక్ష్మీదేవమ్మ తనకు తారసపడ్డ బ్రాహ్మణుడ్ని కథ వినుటకు రమ్మనికోరింది. ఆయవారమునకు వెడుతున్నాను ఇప్పటికే చాలా తడవైపోయినది. నాకు సమయము చాలదని వెడలిపోయాడు. ఆ విప్రునకు ఆ రోజున ఆయవారమేమి దొరకలేదు. అప్పుడా విప్రుడు ఈ పరిస్థితి నేను కథ విననన్న కారణమువల్ల అని వాపోయాడు.

లక్ష్మీదేవమ్మ తనకుకనబడిన కుమ్మరిని, తారసపడిన మేదరినికథవినమనిఅడిగింది వాళ్లుకాదు కుదరదు అనివెళ్లిపోయారు. వారికి వారి వారి పనులు నెరవేరలేదు. వారందరూ ఆమె చెబుతానన్న మాఘపు ఆదివారం కథ విననందువల్లనే తమకు పనులు లభించలేదని విచారించారు.

అంతట లక్ష్మీదేవమ్మ ఊరి వెలపలగల ఉప్పరివాడ మీదుగా వెడుతూ సోది చెప్పు ఉప్పరి స్త్రీని మాఘపు ఆదివారము కథ చెబుతాను వినుటకు రమ్మన మన్నది. అందుకా ఉప్పరి సోదెమ్మ తాను గతరాత్రి పస్తుఉన్నానని తనకుపాయసం వండిపెడితే కథ వింటా నన్నది. అందుకామె ఎంతగానో ఆనందించి ఆ ఉప్పరి వనితను తన ఇంటికి తోడ్కొనిపోయి ఆమె కోరిన ప్రకారం మానెడుపాలు పోసి పరమాన్నము వండిపెట్టింది. ఆపాయసం అబగాతిని గర్భిణితోఉన్న ఆఉప్పరిస్త్రీ సొమ్మసిల్లిపోయింది. గర్భమందున్న బిడ్డమా అమ్మ గర్భంమీద అక్షింతలు ఉంచి కథ చెబితే నేను వింటానని పలికింది లక్ష్మీదేవమ్మ ఎంతగానో ఆనందించి సోదెమ్మ కడుపుపై అక్షింతలుంచి మాఘపు ఆదివారం కథను సాంతంచెప్పింది. మెలకువకలిగిసోదెమ్మకథ చెప్పమని లక్ష్మీదేవమ్మను అడిగింది. కథను నీ కడుపులోని బిడ్డకుచెప్పాను విన్నది అని చెప్పి ఓయమ్మ నీకు మగపిల్లవాడు పుట్టినా ఆడపిల్ల పుట్టినా నాకు కబురంపు అని చెప్పి ఆ సోదెమ్మకు దక్షిణ తాంబూలాదులిచ్చి సాగనంపింది.

కొన్నాళ్లకు ఆ ఉప్పరి సోదెమ్మకు ఆడపిల్ల జన్మించింది. ఆ విషయాన్ని లక్ష్మీదేవమ్మకు తెలియజేసింది. అంత లక్ష్మీదేవమ్మ ఆ బిడ్డనెత్తుకుని వెళ్లి రావి చెట్టుకొమ్మకు చీరతో ఊయలవేసి బిడ్డనందులో పరుండబెట్టింది. పక్షులారా బిడ్డ ఏడ్వకుండాపాటలుపాడండి. చెట్టుల్లారాబిడ్డకుఎండతగలకుండానీడనివ్వండి. జో నీలి మేఘములారా బిడ్డకు చల్లని సేద తీర్చండి. కన్నతల్లికి పనిఉంది పెంచిన తల్లి ఊరువెడలుచున్నది, రయమున మీరంతా వచ్చి బిడ్డను సాకండి అని పలికి లక్ష్మీదేవమ్మ తన ఇంటికి వెళ్లిపోయింది.

ఆదేశమునుఏలే రాజు అటుగా గుర్రముపై వెడుతూ అందాలు చిందు చిన్నారి పసి కందును చూచిపరవసించాడు. ఎత్తుకునితన అంతఃపురానికి తీసుకువెళ్లాడు. దారిలో ఉన్నచేలు పసిడి పంటలను కుమ్మరించాయి. పాడుపడ్డ గ్రామాలు కుదురుకొని కళకళ లాడాయి. రాజు రాజపరివారము ఆ పసిబిడ్డ గొప్పతనానికి ముగ్ధులయ్యారు. ఆ బిడ్డను తీసుకువెళ్లి రాణికి ఇచ్చాడు. బిడ్డలు లేని ఆమె ఎంతగానో ఆనందించి అల్లారుముద్దుగా పెంచింది. ఆ పసికందు దినదిన ప్రవర్ధమానంగా పెరిగి పెద్దదయ్యింది. రాజుఆమెను మోహించి వివాహం చేసుకున్నాడు. రాజ్యము సుభిక్షంగా సాగిపోతున్నది. ఎంతో శోభాయ మానంగా ఉండే ఆమెపట్ల రాజుకుగల ప్రేమానురాగాలకు ఈర్ష్యచెందింది పెద్దరాణి. ఏవిధంగానైనా రాజుకు ఆమెపట్లగల ఆకర్షణనుతొలగించాలన్న ఆలోచన చేసింది. దాసి ద్వారా చిన్నరాణి నగలనుదొంగతనంగాతెప్పించి, ఆమెనగలుఒకపెట్టెలోపెట్టి సముద్రంలోకి విసిరివేయించింది. అలంకారాలు లేని ఆమెపట్లకంటే రాజు తనయందే ప్రేమ చూపుతాడని భ్రమపడింది. కానీ ఆమె ఊహించినట్లు గా ఏమి జరగలేదు. సముద్రంలోకి విసిరిన ఆనగల్ల పెట్టెను ఒక చేప మింగింది. ఒకనాడది పల్లెవారి వలలో పడింది వాళ్లు అపురూపంగా ఉన్న ఆ పెద్దచేపను తెచ్చి రాజుగారికి కానుకగా సమర్పించుకున్నారు.

ఆ చేపను రాజు తన పెద్దరాణి ఇంటికి పంపించి వండించమని రాత్రికి తాను భోజనానికి వస్తానని వర్తమానం చేసాడు. అందుకా పెద్దరాణి ఆలనా పాలనలు అక్కడ చాకిరీలు వంటలు ఇక్కడా అని విసుగుకుని ఆ చేపను చిన్నరాణి ఇంటికి పంపించింది. చిన్నరాణిఎంతో ముగ్ధురాలయ్యింది. వంట నిమిత్తం ఆ చేపను కోయించగా దాని కడుపు నుండి వెలువడిన నగలుచూచి ఆనంద పరవసురాలయ్యింది. రాజు వచ్చేసరికి ఆ చేపను



వండించి దాని కడుపులో దొరికిన సర్వాభరణాలు ధరించి రాజుకు భోజనం పెట్టింది. చిన్న భార్య ఆభరణాలు ధరించి శోభలు వెదజల్లుతుంటే రాజు ముగ్ధుడైపోయాడు.

ఈ సంగతి తెలుసుకొని పెద్దరాణి కుమిలిపోయింది. ఎలాగయినా చిన్నరాణి పీడ తొలగించుకోవాలని పాయసంలో విషం కలిపి చిన్నరాణి ఇంటికి పంపించింది. చిన్నరాణి వద్దకువచ్చిన రాజు ఆవిషపాయసాన్ని త్రాగిమరణించాడు. చనిపోయినరాజుతో సహగ మనం చేసే సాంప్రదాయం ప్రకారం ఇద్దరురాణులు సహగమనానికి సిద్ధమయ్యారు, సన్నాహాలు జరుగుతున్నాయి.

ఆ సమయంలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు చిన్నరాణి మందిరానికి వచ్చాడు. సౌభాగ్యవతి ఎక్కడకు బయలు దేరుతున్నావని ప్రశ్నించాడు. మరణించిన తన భర్తతో సహగమనం చేయుటకు బయలు దేరుతున్నానని చెప్పింది. సరిసరి ఓ సుమంగళి నాకు కాళ్లు కడుగు కోగలందులకు నీళ్లిచ్చి నువ్వుకూడా కాళ్లుకడుగుకోవసిందన్నాడు ఆ వృద్ధవిప్రుడు. అతని మాటతిరస్కరించలేక ఆప్రకారంచేసింది. నాకు దాహమిచ్చి నీవు కూడా దాహానికి పుచ్చుకో అన్నాడు. అయ్యా భూసురోత్తమా నాభర్తశవం దహన సంస్కారాలకు సిద్ధంగా ఉన్నది. నేను వాని చితియందు పడి ప్రాణత్యాగం చేసి నాభర్త వెంటపోవనుంటిని ఇప్పుడుమీరు నన్నుదాహమిమ్మనుట ధర్మంకాదన్నది. ఆగతి నీకు కలుగరానియ్యను నేను చెప్పినట్లు చేయవే సౌభాగ్యవతీ అని విప్రుడు పలుకగా వానికి దాహమిచ్చింది రాణి. నాకు తలంటి గంధంపూసి నీవు కూడా తలంటుకొని పసుపు పూసుకోవలసిందన్నాడు ఆ వృద్ధుడు. ఏమిటిది విప్రోత్తమా! మీకిది తగునా మొగుడుపోయి యేడ్చుచున్నదానను కడిగిన కాళ్లను దాచుకుంటిని దాహంపుచ్చుకుని కడుపుదాచుకున్నాను. తలంటుకునిపసుపు దాచు కొనగలుగుటెట్లు అనివాపోయింది. ఎందుకమ్మా అంతభయము నేనుచెప్పినట్లు చెయ్యవల సిందని ఆజ్ఞాపించాడు. కాదనలేక ఆ వృద్ధవిప్రునకు తలంటు నీళ్లుపోసి తానూ పోసుకుని అతనికిగంధము పూసి తాను కూడా పసుపు వ్రాసుకొని వానికి భోజనము పెట్టి తాను భోజనం చేసి అతనికితాంబూలమిచ్చిఅతనిమాటమేరకు తానూ తాంబూలం వేసుకున్నది.

అంతట ఆవృద్ధ బ్రాహ్మణుడు ఆమెముందు శ్రీ మహావిష్ణువుగా సాక్షాత్క రించాడు. అమ్మా! నీవు కడు పుణ్యాత్మురాలవు. నువ్వు నీ తల్లి గర్భమందుండగానే మాఘపు ఆదివారం కథనువిన్న పునీతురాలవుకావలసిన వరంకోరుకోఅన్నాడు. అంతటఆమెతనపతిని సజీవుడ్ని చేయమని కోరుకున్నది. అంత శ్రీ మహావిష్ణువు ఆమె కోర్కెను మన్నించి రాజును సజీవుడ్ని చేసాడు. అక్కడున్న వారంతా ఎంతగానో ఆనందించిరి. పెద్దరాణికి కూడా తన పసుపు కుంకుమలు నిలబెట్టిన చిన్నరాణిపట్లద్వేషంతొలగిప్రేమాభిమానాలుకలిగాయి. అందరూ ఆమెను నువ్వేమినోము నోచితివని ప్రశ్నించారు. అందుకామె నేను ఏ నోమును నోయలేదు. ఇదంతా నేను నా తల్లి గర్భమందుండగా లక్ష్మీదేవమ్మ అను భక్తురాలు చెప్పిన మాఘపు ఆదివారము నోము కథను విన్న ఫలమని వారందరికి విన్నవించింది.

కథయందే ఇంత గొప్పతనం కలిగిన ఆనోము ఎంతగొప్పదో అన్న భక్తికలిగి ఆదేశ స్త్రీలు మాఘపూర్ణిమకు ముందువచ్చు ఆదివారం ఈమాఘపు ఆదివారంనోమును క్రమము తప్పకుండా చేసి సకల భోగభాగ్యాలతో ఇహాన్ని ముక్తితో పరాన్ని తరింపజేసుకుని వర్ధిల్లారు.

**ఉద్యాపన :**-ఈ నోము అయిదు సంవత్సరాలు చెయ్యాలి మొదటి సంవత్సరములో ఈ నోము నోచుకునేవారు పాలు త్రాగకూడదు. సంవత్సరం ఆఖరున అయిదుగురు ముత్తైదువులకు క్షీరాన్నముతో భోజనం పెట్టాలి.

రెండవ సంవత్సరం ఈనోము నోచుకునేవారు మజ్జిగ త్రాగకూడదు. రెండవ సం॥రం ఆఖరుఆదివారంరోజునఏడుగురు ముత్తైదువులకుపెరుగువేసి భోజనం పెట్టాలి.

మూడవ సంవత్సరం ఈ నోము నోచువారు పప్పులు తినకూడదు. ఆఖరు ఆదివారం అయిదుగురు ముత్తైదువులకు బూరెలతో భోజనం పెట్టాలి.

నాలుగవసంవత్సరం ఈనోమునోచేవారు తాముతలంటుకోకుండానలుగురు ముత్తైదువులకు తలంటుస్నానం చేయించి భోజనం పెట్టాలి. తాను తాంబూలం వేసుకోకుండా అయిదుగురు ముత్తైదువులకు తాంబూలాలివ్వాలి.

ఆఖరు అయిదవ సంవత్సరము ఈ నోము నోచేవారు అయిదురుగు సుమంగళులకు చీర, రవికల గుడ్డ, ఉగ్గుగిన్నె, ఉయ్యాల ఇచ్చి సూర్యనారాయణ మూర్తికి అయిదుమూరల అంగవస్త్రం ఇచ్చి ఉద్యాపన చేసుకోవాలి.

## 10. ఆపదలేని ఆదివారం నోముకథ

పూర్వకాలంలో ఒక కుగ్రామంలో దేవదత్తుడనే సద్బ్రాహ్మణుడుండెడివాడు. మంచికి మారుపేరుగా దాన ధర్మాలకు ప్రసిద్ధుడుగా వర్ధిల్లుతుండేవాడు. క్రమక్రమంగా సిరిసంపదలు తరిగిపోయాయి. అయినా ఆ సద్బ్రాహ్మణుడు చెదరక బెదరక చేతనైన దానధర్మాలు చేస్తూ జీవిస్తుండేవాడు.

ఆ దేవదత్తునకు ఒకకొడుకు. అతనికివివాహం చేసాడు. కోడలు కాపురానికి వచ్చింది. వచ్చినది మొదలు ఆమె తనమామగారిని ఆపదలంటే ఏమిటని ప్రశ్నిస్తుండేది. ఆపదలు అంటేకష్టాలు అనిచెప్పి కోడలి మనస్సును కలతపెట్టడం ఇష్టంలేక దేవదత్తుడామె ప్రశ్నను దాటవేస్తుండేవాడు కొంతకాలానికి ఆమెకొకకొడుకు కలిగాడు. కాని ఆమెకు తన ప్రశ్నకు సమాధానం దొరకలేదు. ఆమె ఒకనాడు మామగారూ! నేను కాపురానికి వచ్చిన దగ్గరనుండి ఆపదంటే యేమిటనిమిమ్మల్ని ప్రశ్నిస్తునే ఉన్నాను మీరుజవాబు చెప్పకుండాదాటవేస్తున్నారు ఇదేమిధర్మంతెలియనిదానినితెలియజెప్పడం తమవంటివిజ్ఞులధర్మం అని నిష్ఠూరమాడింది.

ఆ మాటలకు దేవదత్తుడు యేమి చెప్పడానికి తోచక ఆమె కుమారుడ్ని తనవద్దనున్న దర్భతోకొట్టాడు. ఆదెబ్బకు ఆకుమారుడు చనిపోయాడు పిల్లవానికొరకై ఏడుస్తున్న కోడల్ని ఉద్దేశించి మనసుకుబాధకలిగించే ఇదేనమ్మా ఆపదంటేఅనిఅన్నాడు. పుత్రశోకం భరించలేకపోయిందికోడలు. ఊరుకు వెలుపలగల అడవిలోనికి వెళ్ళి పిచ్చిదానిలా తిరుగసాగింది.

లోకపాలకులయిన శివపార్వతులు ఆకాశమార్గాన లోకాలను లోకుల్ని చూసుకుంటూ వెళుతూ ఈమెనుచూసారు. క్రిందకుదిగివచ్చి అబలా! ఎందువల్ల ఇలా ఒంటరిగా తిరుగుతున్నావని ప్రశ్నించారు తాను తమ మామగారిని ప్రతీరోజు ప్రశ్నించడం కడకు ఆయన సమాధానంగా తన కుమారుడ్ని దర్భతో కొట్టడం వాడు చనిపోవడం వివరించి పుత్రశోకం భరించలేక ఇలాబాధపడుతున్నాను. నాకు ఎందువల్ల ఇలా ఆపద కలిగిందని ఆ ఆదిదంపతుల్ని ప్రశ్నించింది. బిడ్డా నువ్వు నీ గత జన్మలో ఆపదలేని ఆదివారం నోమును సక్రమంగా



చేయనందువల్ల నీకీబుద్ధి ఈఆపదకలిగినవి అనివివరించి ఇంటికిపోయి ఆపదలేని ఆదివారం నోమునోచుకుని ఉద్యాపనచేసుకొనవలసినదని ఉపదేశించాడు. అంతట ఆ కోడలు ఇంటికి చేరుకుని ఆపదలేని ఆదివారం నోమునోచుకుని సక్రమంగా ఉద్యాపన చేసుకున్నది. ఆనాటినుండి ఆపదంటే ఏమిటో తెలియక ఆ ఆలోచనే కలుగక హాయిగా జీవించినది.

**ఉద్యాపన :**-ఈనోము ఆదివారం రోజునచెయ్యాలి. 12 ఆదివారాలు చేసి 13వ ఆదివారం 26 మంది ముత్తైదువులకు రెండున్నర లీటర్ల పాలు, మానెడు సోలడు (1-1/4 కె.జి) బియ్యంతో క్షీరాన్నం వండాలి. మాడు, తెట్టు లేకుండా ఆ పరమాణ్ణాన్ని సూర్యదేవునకు నైవేద్యంపెట్టి 26 మంది ముత్తైదువులకు పంచిపెట్టాలి. ఒక ముత్తైదువులకు పసుపు కుంకుమ రవికలగుడ్డ దక్షిణ తాంబూలాలిచ్చి వాయనమివ్వాలి.

## 11. శోకము లేని సోమవారం నోము కథ

పూర్వకాలంలో ఒకబ్రాహ్మణుడుండేవాడు అతనికినలుగురు కుమారులు, ఒక కుమార్తె. కుమార్తెకు వివాహంచేయగా ఆమె భర్తదేశాంతరంవెళ్ళి ఎంతకాలమైనప్పటికి తిరిగి రాలేదు. భర్తరాకకై కుమార్తె కన్నీరు మున్నీరుగా ఏడ్చుచుండెను. ఇంట ఆడబిడ్డ ఏడ్చుట శ్రేయస్కరం కానందున తండ్రికి ఆమెఉసురు తగిలినిరుపేదఅయిపోయాడు. దుఃఖకా రకమైన దరిద్రము ను పోగొట్టుకొన గోరి తండ్రిపుణ్యకార్యాలనుచేయుటకు సంకల్పించుకున్నాడు.

ప్రజోపయోగకరములగు పనులను చేయతల పెట్టుకున్న తండ్రి గ్రామము నందొక చెరువును త్రవ్వించెను. దురదృష్ట ప్రభావముచే ఆ చెరువున నీళ్ళు పడలేదు. అంతట ఆ విప్రుడు పరమేశ్వరుడ్ని గూర్చి తపస్సు చేసెను. పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఓయీ! నీవు నీపెద్దకుమారుడ్ని ఆచెరువు తూమునకు అడ్డముగా వేసినచో నీరు నిలిచి చెరువు పుష్కలమగును. నీకుమార్తెచే శోకములేని సోమవారం నోమునునోయించినచో నీఅల్లుడు తిరిగి రాగలడు. గత జన్మలో ఆమె శోకములేని సోమవారం నోమును ఉల్లంఘనము చేసినది. కనుకనే ఆమెకీ జన్మమున భర్తకుదూరమై శోకించుచున్నది. ఆమెచేనోమునోయించి కథ చెప్పించి అక్షింతలుశిరస్సున చల్లుకొన వలెను. 12 సోమవారాలు ఈ శోకములేని నోము నోచుకుని ఒక్కపూట భోజనంచేస్తే ఆమెకుశోకముతొలగిపోతుందనిచెప్పి పరమేశ్వరుడు అంతర్హితుడయ్యాడు. తండ్రి తనకుమార్తెచేత ఆ ప్రకారం చేయించాడు. భక్తితో శ్రద్ధగా నోము నోచుకున్న కారణంగా ఆమె భర్త ఇంటికి సురక్షితంగా చేరుకున్నాడు. ఆమె భర్తతో కూడా మరేవిధమైన శోకము లేకుండా జీవితాంతం సుఖముగా బ్రతికింది.

**ఉద్యాపన :**- మానెడుసోలెడు (1-1/4 కె.జి)బియ్యముతోఅత్తిసరువండాలి. అట్టగట్టిన అడుగునుతొలగించి ఆఅత్తిసరుకు ఒకరవికెలగుడ్డనువాసినగట్టాలి.అలావాసిన గట్టిన అత్తిసరును దక్షిణతాంబూలాదులు,గంధాక్షతలతోఒక ముత్తైదువులకు వాయినమిచ్చి ఆమె ఆశీస్సులు పొందాలి. వ్రతములో లోపములుండరాదు భక్తి శ్రద్ధ కొరవడరాదు.

## 12. అమావాస్య సోమవారం (అమాసోమవార) నోము కథ

పూర్వకాలంలో ఒకానొక గ్రామంలో ఒక విప్రుడుండేవాడు అతనికి ఏడుగురు పుత్రులు ఒక కుమార్తె కుమారులందరికి వివాహాలయ్యాయి. వారంతా కుమార్తెను అల్లారుముద్దుగా చూస్తుండేవారు. ఒకనాడొక బ్రాహ్మణుడు ఉపాదానం నిమిత్తం వారింటికి

వచ్చాడు. తనకు ఆయవారం వేయవచ్చిన బాలికను చూచి విప్రుడ్ని పిలిచి అయ్యా! మీ కుమార్తెకు వైధవ్యం కలిగే ప్రమాదముందని తెలియజెప్పాడు. అందుకా బ్రాహ్మణదంపతులు కలతచెంది వానికి నమస్కరించి అయ్యా తమరు జ్ఞానసంపన్నులు మా అమ్మాయికి ఈ ఉపద్రవము తప్పే మార్గం చెప్పవలసిందని వేడుకున్నారు.

ఆ బ్రాహ్మణుడు బాగా ఆలోచించి ఇక్కడకు సుదూర తీరానగల కాసారానికి ఆవలి తీరాన చాకలిపోలి అనబడే యోగ్యురాలున్నది. మీ అమ్మాయిని అక్కడకు తీసుకువెళ్లండి. భక్తురాలు కరుణాస్వరూపిణియైన ఆమె మాత్రమే మీకు మేలు చేయగలదని చెప్పి వెళ్లిపోయాడా బ్రాహ్మణుడు. దూరాభారాలు భరించలేక తండ్రీకొడుకులు ఊరుకున్నారు. ఆమె పెద్దన్నగారు చెల్లెలుపట్లగల మమకారం కొద్దీ ఆమెను వెంటబెట్టుకుని చాకలిపోలి వద్దకు బయలుదేరాడు. కాసారం దాటేతెరవు తోచక ప్రయాణ బడలిక వలన ఆకలితో కాసారతీరాన గల ఒక చెట్టునీడలో అన్నగారు తన చెల్లెలతో దిగులుపడి కూర్చున్నారు. అంతలో దిక్కుతోచక కూర్చున్నవాళ్ల ముందు చెట్టునుండి ఒక పండు రాలిపడింది. అది తిని ఆకలితీరి కాసారం దాటే మార్గమేమిటా అని ఆలోచిస్తున్నారు.

ఒక గండబేరుండ పక్షివచ్చి వారిని తన వీపున కూర్చుండబెట్టుకుని ఆవలి తీరానికి తీసుకువెళ్లిచాకలి పోలి యింటిముందు దింపింది. అన్నా చెల్లెళ్లిద్దరు పోలివాకిలి తుడిచారు. కళ్లాపు జల్లారు, ముగ్గులు పెట్టారు. ఇలా ప్రతీరోజు చేస్తూ అక్కడగల ఒకచెట్టు తొర్రలో ఉంటుండేవారు. తన వాకిలిని శుభ్రపరుస్తున్నవారు ఎవరా అని చాకలి పోలి కనిపెట్టేటందుకు ప్రయత్నించి ప్రయత్నించి ఒకనాటి వేకువజామున వారిని చూచింది. మీరెవ్వరు ఎందుకిలా చేస్తున్నారనిప్రశ్నించింది. అందుకాఅన్నగారు ఆమెవల్ల సహాయం కోరి ఇట్లు చేస్తున్నామని చెప్పాడు. అదేమిటో చెప్పమన్నది చాకలిపోలి. తన చెల్లి పరిస్థితిని వివరించి ఆమెకు వైధవ్యము ప్రాప్తించకుండా చేయవలసినది. ఇది నీ వల్లనే సాధ్యమౌతుందని ఒక విప్రుడు చెప్పాడని వివరించాడు.

వాని కోరికను మన్నించి తన కొడుకులను, కోడళ్లను పిలిచి తాను పనిబడి ఊరువెడుతున్నాను. నేను వచ్చేలోపున ఎవరైనా చనిపోతే దహనము చేయకుండా భద్రపర్చవలసిందని చెప్పి ఆ అన్నాచెల్లెళ్లతో చాకలిపోలి ప్రయాణమై తన శక్తితో వారితోపాటుకాసారమును దాటివారిస్వగ్రామానికివెళ్లింది. ఆపిల్లకు పెళ్లిచేయవలసిన దిగాచెప్పి పెళ్లి చేయించింది. వివాహ కాలంలో పెళ్లి కుమారుడు సప్తపాదాలు తిరుగుతూ నేలకొరికి చనిపోయాడు. చాకలిపోలి తాను చేసిన అమావాస్య సోమవారం నోముల ఫలితాన్ని దారపోసి వరుడ్ని బ్రతికించింది. ఈ కారణము వల్ల ఆమె ఇంటివద్ద ఆమె కుమారులంతా చనిపోయారు. ఆ సంగతి గ్రహించి ఆ వధువునకు అమావాస్య సోమవారంనోమును ఉపదేశించి తాను తన ఇంటికి బయలుదేరింది. మార్గమధ్యమందు అమావాస్య సోమవారం రాగా అశ్వత్థ వృక్షం కనబడడంతో నూట ఎనిమిది గువ్వరాళ్లు పట్టుకుని ప్రదక్షిణ చేసింది. అందువల్ల ఆమె కుమారులంతా సజీవులయ్యారు ఇంటికివెళ్లిన ఆమెను ఆకోడళ్లు తమభర్తలు చనిపోవడం సజీవులై లేవడంవివరించి ఇందుకుకారణమేమిటనిప్రశ్నించారు. ఆమె జరిగినదంతయు వారికిచెప్పి ఇదంతాఅమావాస్యసోమవారపు నోము ఫలమని వివరించింది. ఆమె, ఆమెకొడుకులు, కోడళ్లు,ఇక్కడబ్రాహ్మణవధూవరులు వ్రత ప్రభావం వల్ల సుఖంగా ఉన్నారు.



**ఉద్యాపన :-** ఈ నోమును సోమవారం అమావాస్య కూడిన రోజున చేయవలెను. మూలమున బ్రహ్మ, కాండమున శ్రీహరి, అగ్రభాగాన శివఅంశగల వృక్షరాజమగు అశ్వత్థ వృక్షానికి 108 పర్యాయములు ప్రదక్షిణ నమస్కారము చేయాలి. ప్రదక్షిణ కాలమందు ఒక పండును గాని రత్నాన్ని గాని వేయాలి. త్రిమూర్తిత్రయరూప వృక్షమా నీకునమస్కారం అంటూ చెప్పుకోవలెను. ఆ వృక్షం నీడలో శేరుబియ్యంతో మండపంచేసి ఎనిమిదిదిక్కులలో కలశాలుఫలతాంబులాలుంచి శ్రీమన్నారాయణున్ని, దిక్పాలకులను పుష్పాక్షింతలతో పూజించాలి. పూజానంతరమండపాన్నిబ్రాహ్మణునకుదారపొయ్యాలి. 108 ఫలాలు గాని రత్నాలను గాని పంచిపెట్టాలి. ఒక ముత్తైదువుకు పిండివంటలతో భోజనం పెట్టి చీర, రవిక, దక్షిణ తాంబూలా లివ్వాలి. భక్తిగా శ్రద్ధగా శక్తిమేరకు ఈ వ్రతం చేసిన వనితలకు వైధవ్యము కలుగబోదు.

## 13. చద్దికూటి మంగళవారం నోముకధ

పూర్వం ఒకరాజు ఆస్థానమందు ఒక రాజపురోహితుడుండేవాడు కర్మవసాన ఆ రాజపురోహితుడు నిరుపేదయై సమస్తమైన వారిచేత నిరసింపబడు తుండేవాడు. అతని కుమార్తె తండ్రిదుస్థితికి ఎంతగానో బాధపడుతుండేది. ఆనగరరాజ పురోహితులు రాకుమార్తెకు చద్దికూటి మంగళవారం నోము గురించి చెప్పగా నిరుపేద పురోహితుని కూతురు విన్నది అది అత్యంత పుణ్యప్రదమైనట్టిదని సమస్తమైన ఈతి బాధలు తొలగిపోవునని చెప్పగా విని ఆనోము నోచుకొనుటకు నిశ్చయించుకున్నది.

బ్రాహ్మణ పుత్రిక రాచపట్టి ఇద్దరూ చద్దికూటి మంగళవారం నోముకు పూనుకున్నారు. నోము నియమానుసారం సోమవారం రాత్రి పప్పు,పులుసు, అన్నం, వండుకుని వాటినిభద్ర పర్చుకునేవారు మంగళవారం సూర్యోదయానలేచి కాలకృత్యాలు తీర్చుకుని తలారా స్నానం చేసి మడిబట్టలతో పూజచేసి అక్షింతలు నెత్తిన వేసుకుని ఒక ముత్తైదువులకు భోజనంపెట్టి భుజిస్తుండేవారు.

సంవత్సరం వరకు నియమానుసారం పూజలు చేసుకుని సంవత్సరాంతాన ఉద్యాపన చెప్పుకున్నారు. బ్రాహ్మణపుత్రికఇంటకష్టాలుతొలగిపోయాయి. రాచకుమార్తెకు యేవిధమైన ప్రయోజనముకలగలేదు. కానిక్రమక్రమంగా దారిద్ర్యం ఆమెనుఆవరించింది. ఇదేమినాప్రారబ్దం నేనూ ఆవిప్రునికుమార్తె ఈచద్దికూటి వ్రతంచేసు కుంటిమి ఆమెకాఉన్నతస్థితి, నాకీదుస్థితి కలిగిందని కలత చెందుచుండెడిది. ఒంటరిగా అడవులకేగి రాచపట్టి బాధపడుతుండేది.కరుణామయులైన పార్వతీపరమేశ్వరులు ఆమెనుచూచి నువ్వు బాధపడి ప్రయోజనమేమి బ్రాహ్మణపుత్రిక భక్తిశ్రద్ధలతో పూజచేసి చద్దిని సూర్యునకు నివేదించి ఆ తరువాత ముత్తైదువులచే ఆరగింపచేసి భుజించేది. సంవత్సరానంతరం పదముగ్గురు పేరంటాళ్లకు భక్తి శ్రద్ధలతో తలంటి నీళ్లుపోసి కొత్తబట్టలిచ్చి భోజనం పెట్టి వాయనం తీర్చుకొన్నది. కాని నీవురాచబిడ్డన్న భావంతోపేరంటాళ్ల ఆదరణలోశ్రద్ధచూపకపోవడం వారిని సంతృప్తులుగా సత్కరించడంలోనిర్లక్ష్యం వహించడం వల్ల నీవు నోచుకున్న నోము నీకు అక్కరకు రాలేదు ఇకనైనను నీవునమ్మకముంచి శ్రద్ధతో,భక్తితో ఈచద్దికూటి వ్రతమును చేసుకొనుము నీకు మేలు కలుగుతుందని చెప్పి అంతర్థితులైయ్యారు పార్వతీ పరమేశ్వరులు. రాచపట్టి

నోముయందు అచంచలమైన విశ్వాసముంచి శ్రద్ధతో నోము నోచుకుని భక్తితో ముత్తైదువులను ఆరాదించి సంవత్సరాంతమున ఉద్యాపన చెప్పుకున్నది. ఆమె దుస్థితి తొలగి సుఖప్రశాంతులతో హాయిగా జీవించింది. ఈ నోముకు భక్తి-శ్రద్ధ ముఖ్యము.

**ఉద్యాపన :-** ప్రతీమంగళవారంముందునాటిరాత్రివంటకాలనునివేదించి ముత్తైదువుకుపెట్టితానుభుజించాలి. ఆమెకుదక్షిణతాంబులాలివ్వాలి ఇలాసంవత్సరముపూర్తయ్యాక సోమవారంనాటి రాత్రిపేరంటాళ్లకు పిండివంటలతోభోజనమునుతయారుచేసి పదార్థాలను పదమూడు మూకుళ్లలోపెట్టి మంగళవారం పదముగ్గురు ముత్తైదువులకు తలంటి నీళ్లు పోసిచద్దిని,రవికలముక్కను పసుపు,కుంకుమ,దక్షిణతాంబూలాలతోవాయనం తీర్చుకోవాలి.

## 14. మార్గశిర లక్ష్మివారపు నోముకథ

పూర్వకాలంలో ఒక పల్లెటూరి యందొక బ్రాహ్మణుడుండేవాడు. అతనికి మొదటి భార్యకొక కూతురు గుణవతి ప్రతిరోజూఆబాలికమట్టితోలక్ష్మీదేవిబొమ్మనుచేసి ఆడుకుంటుండేది. సవితితల్లి ఆమెకు తన బిడ్డనెత్తుకుని ఆడించుటకు బెల్లంముక్క పెడుతుండేది. ఆబెల్లపుముక్కను తన లక్ష్మీదేవికి (మట్టిబొమ్మకు) నైవేద్యంగా పెట్టి పూజ ఆటను ఆడుకుంటుండేది.

కొంతకాలానికి ఆ బాలికకు యుక్తవయస్సు వచ్చింది తల్లిదండ్రులామెకు వివాహం చేసారు. ఆమె అత్తవారింటికి వెడుతూ తనతో తనబొమ్మను (లక్ష్మీదేవిని) కూడా తీసుకువెళ్లింది. ఆఇంటి సిరి లక్ష్మీదేవికూడా ఆమెవెంటే తరలిపోయింది. అందువల్ల ఆమెపుట్టింటివారికి దారిద్ర్యము అత్తింటివారికి సిరిసంపదలు కలిగాయి. పుట్టింటివారు దారిద్ర్యముతో బాధపడుతున్నారని తెలుసుకున్నది. తనసవతి తమ్ముడ్ని పిలిపించి ఒకచేతికర్రను దొలిపించి అందులో నాణెములు పోసి దానిని తన తమ్ముడికిచ్చి ఇంటికి పంపించింది. స్వగ్రామానికి వస్తూ మార్గమద్యంలో కాలకృత్యాలు తీర్చుకోడానికి చెరువుగట్టున ఆగాడు చేతనున్నకర్రను అక్కడగల చెట్టుకు జేరవేశాడు తిరిగి వచ్చి చూచేసరికి ఆ కర్రకనబడలేదు. మార్గస్తులెవరో తీసుకువెళ్లిపోయారు అతడు ఉత్తచేతులతో ఇంటికి వెళ్లిపోయాడు.

మరికొంత కాలానికి వాళ్లపరిస్థితిలో ఏ మార్పులేకుండా దారిద్ర్యముతో బాధపడుతూనే ఉన్నారని తెలుసుకున్నది. తమ్ముడ్ని పిలిపించి చెప్పులలో వరహాలు పోయించి కుట్టించి దానిని తన సవతి తమ్మునకిచ్చి తండ్రికివ్వవలసిందిగా చెప్పిసాగనంపింది. మార్గమద్యంలోగల చెరువునదాహం తీర్చుకొనుటకై జోళ్లు గుట్టున విడిచినీళ్లుత్రాగి వచ్చి చూడగాఅవిలేవు. వాటినిఒకకుక్కనోట కరచుకుపోయింది. మరికొంత కాలానికి తమ్ముడ్ని పిలిచి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నది. బాగా ఆలోచించి ఒక గుమ్మిడికాయలో వరహాలుపోయించి ముచ్చిక బిగించి దానిని తమ్మునికిచ్చింది. ఇంటికి పట్టుకువెళ్లి తల్లికియ్యమనిచెప్పింది. మార్గమద్యంలో గట్టున గుమ్మిడికాయను నుంచి తాను కాళ్లుకడుక్కుని చద్దిని తింటుండగా బాటసారి ఒకడు గుమ్మిడికాయను చూచి పట్టుకుని వెళ్లిపోయాడు.

మరికొంత కాలానికి ఆమె పుట్టింటికి వచ్చింది వారిపరిస్థితి దుర్భరంగా ఉండటం చూచిఎంతగానోవిచారించింది.వారికిసహాయపడవలెననిఎంతప్రయత్నించినా ప్రయోజనం లేకపోవడం వల్ల ఏం చెయ్యాలా అని తీవ్రంగా ఆలోచించింది. లక్ష్మీదేవి నోము నోయిస్తే



వీళ్ల దారిద్ర్యం తీరవచ్చునని నిర్ణయించుకున్నది. లక్ష్మీవారపు నోము నోయించగలందులకు తల్లిదండ్రులను తన యింటికి తీసుకువెళ్లింది.

మార్గశిర లక్ష్మివారము వచ్చింది అమ్మా! లక్ష్మీదేవి నోము నోచుకుందాము నువ్వు ఎంగిలిపడవద్దని తల్లికిచెప్పింది. ఆమె పిల్లలకు చద్దిపెడుతూ అలవాటు ప్రకారం తననోట ఒక ముద్దవేసుకున్నది. రెండవ లక్ష్మివారము వచ్చింది తల్లిని నిష్టగా నోట ఏమి వేసుకొనవలదనిహెచ్చరించింది. ఆమె పిల్లలకు తలస్నానం చేయిస్తూ గిన్నెలో మిగిలిన నూనె తన తలకు రాసుకున్నది. రెండవ లక్ష్మివారం కూడా ఆమెవృధా చేసినందుకు విచారించింది మూడవలక్ష్మివారం వచ్చింది. ఇప్పుడైన జాగ్రత్తగా నిష్టగా ఉండమన్నది తల్లిని. ఆమె పిల్లలకు తలదువ్వుతూ తానూ తలదువ్వుకొన్నది. మూడవ లక్ష్మివారం కూడా నోము నోచుకోవడంజరగలేదు. నాల్గవ లక్ష్మివారం రాగా తల్లిని నియమనిష్టలతో ఉంచి నోము నోయించాలని నిర్ణయించుకున్నది. అందుకుగాను ఆమెను ఒకగోతిలో కూర్చుండ బెట్టి పైన తలుపు మూత పెట్టింది. పిల్లలు అరటిపళ్లు తింటూ తొక్కలను ఆగోతిలో వేసారు. తల్లి వాటిలో ఒక తొక్కను తిన్నది. అందుకా కుమార్తె ఎంతగానో విచారించింది. అయిదవ లక్ష్మివారం వచ్చింది ఎలాగైనా తల్లిచేత నోము నోయించాలని ఆమెచీర చెంగును తన చీరచెంగునకు కట్టుకుని ఏవిధమైన నియమ భంగం కలగకుండా జాగ్రత్తపడింది.

తనతోపాటు తనతల్లితో కూడా లక్ష్మివారపునోమునోయించింది. నైవేద్యముగా పెట్టిన పూర్ణము కుడుములలో తాను పెట్టిన వాటిని లక్ష్మీదేవి స్వీకరించి ఆమె తల్లి పెట్టినవాటిని స్వీకరించలేదు. ఏమిటితల్లి ఎందువల్లనాతల్లి పెట్టిననైవేద్యాన్ని స్వీకరించలేదు కారణ మేమిటని ప్రశ్నించింది అందుకా లక్ష్మీదేవి బిడ్డా! నీవు పసితన మందు నన్ను పూజిస్తున్న కాలములలో ఒకనాడునీసవతి తల్లిచీపురుతో నిన్నుకొట్టింది. ఆదోషంకారణంగా నైవేద్యాన్ని నేను పుచ్చుకోవడంలేదని చెప్పింది. అమ్మా నాతల్లి చేసిన తప్పును క్షమించి ఆమెపెట్టిన నైవేద్యాన్ని స్వీకరించి ఆమెను అనుగ్రహించు అని వేడుకున్నది. లక్ష్మీదేవిప్రసన్నురాలై ఆమెకోర్కెనుమన్నించింది. తదుపరి సంవత్సరం తనతోపాటు తనసవతి తల్లిచేత నోమును నాలుగువారాలు సక్రమంగా భక్తితోశ్రద్ధగాచేయించింది. పులగంపరమాన్నాన్ని, కుడుములనునైవేద్యంగా పెడుతూ ఆఖరువారమైన పుష్యమాసం మొదటి లక్ష్మివారం పూర్ణకుడుములు నైవేద్యం పెట్టి పూజలందించారు. అందువల్ల అమ్మవారి కరుణను ఆర్జించుకోగలిగారు. దారిద్ర్యము తొలగిపోయింది.

**ఉద్యాపన :-** మార్గశిర మాసమునుండి పుష్యమాసం వరకు అయిదు లక్ష్మివారాలు ఈ నోమును నోచుకోవలెను. కుడుములు శ్రీమహాలక్ష్మికి నైవేద్యము పెట్టాలి. వ్రతం అనంతరం కథను చెప్పుకోవాలి. అయిదువారాల అనంతరం సవగాయ పిండివంటలతో ముత్తైదువులకు భోజనంపెట్టాలి. కనీసంవారిలోఅయిదుగురికైనా దక్షిణ తాంబూలాలు రవికెల గుడ్డలిచ్చి వారికి దండప్రణామములు చేసి వారి ఆశీర్వాదములు పొందాలి.

## 15. వావిలి లక్ష్మివారపు నోముకథ

పూర్వకాలము ఒక ఊరిలో ఒకానొక బ్రాహ్మణుడుండేవాడు తనకు గల కొడుకులు కూతుళ్లలో ఆఖరు కూతురు కాపురము కడుపేద కాపురము. ఆమెను పుట్టింటివారు తమ ఇంట జరుగు శుభకార్యములకు గాని పండుగ పబ్బములకు గానిపిలిచేవారుకాదు. ఆమెపిల్లలనుసైతంఅంతగా ఆదరించేవారు కాదు. బ్రాహ్మణుని ఆఖరి కుమారునకు

జరిగిన వివాహమునకు బంధుజనాన్ని అందర్ని పిలిచారు గాని పొరుగునే ఉన్న చిన్న కూతుర్నిగాని ఆమె పిల్లల్ని గాని పిలవలేదు పిల్లలు మాత్రం తాతగారింటికి వెళ్లి పనుల్లో పూనుకుని తోడ్పడుతున్నా వాళ్లు విసుగుకునేవారు.

పెద్దవదినగారుమాత్రం చిన్న ఆడబడుచుదుస్థితికి ఎంతగానో ఆవేదన చెందుతుండేది. మరిది వివాహకాలంలో ఆమె కడిగిన బియ్యం అద్దెడు తవ్వడు తీసి క్రొత్త చేటలో పోసి కడుగని అద్దెడు బియ్యం అందులో పోసి ఒక రవికల గుడ్డను, దక్షిణ తాంబూలములను అందుంచి పాతచేటను వాటిపై మూతవేసి పెరటిదారిని వెళ్లి ఇంటిగోడమీదనుండి ఆడపడుచుకు అందించింది. ఆవాయనమును అందుకున్న ందువల్ల ఆమె పరిస్థితులుమారి సిరిసంపదలు కలిగి భాగ్యవంతురాలయ్యింది. అందరూ పుట్టింటివారితో సహా ఆమెను ఎంతో గౌరవించనారంభించారు.

ఆమె పుట్టినింటియందు అన్నగారి కుమార్తె వివాహమునకు వారామెను ఎంతోఆదరముగా స్వయముగా ఆందరూవచ్చిఆహ్వానించారు. ఆమెచీనీచీనాంబరములుధరించి పుట్టినింటికిపెళ్లికివెళ్లింది. వారంతాఈమెకు పెద్ద పీటవేసి పిండివంటలన్నీ వడ్డించారు. అంతట ఆమె తన వంటిమీద ఆభరణములు తీసి పీటమీద ఉంచి ఆభరణములారా మీరే ఆరగించండి అని ఇంటికి వెళ్లిపోవుచుండగా అక్కడ బంధువులంతా అదేమమ్మా అని ప్రశ్నించారు. నాపుట్టింటివారు నన్నుగాక నాఆభరణములు చూచి నన్ను ఆహ్వానించారు. ఎంతో మన్ననా మర్యాద చేస్తున్నారేగాని కన్నబిడ్డనన్న మమకారం వల్ల కాదని పలికింది. పేదరాలివైన నీకీసిరిసంపదలు కలిగినవైనమేమిటని అందరూఆమెను ప్రశ్నించారు. పడతులారా మాపెద్ద వదినగారు వావిలలక్ష్మీనోము వాయనం నాతమ్ముడి వివాహ కాలమున వచ్చి నాకిచ్చినది. అది అందుకున్నందువల్ల నాకీసిరిసంపదలుకలిగాయి. ఇలా సిరిలేకపోతే నావారు నన్ను మొదటిలాగా విడిచి ఉండేవారు అని చెప్పింది. ఆమె మాటలకు చేతలకు పుట్టింటిలోని వారంతా ఆమెపట్ల అపారమైన గౌరవాన్ని చూపించారు. ఇది విన్న స్త్రీలంతా వావిలి లక్ష్మీనోము వాయనానికే ఇంత మహత్యమున్నచో నోముకింకెంత మహత్యముండునో అని తలచి వారంతా ఈ నోమును నోచుకుని భోగభాగ్యాలను పొందారు.

**ఉద్యాపన :-** మొదటి ఏట ఈ లక్ష్మివారం వ్రతం చేసుకుని కథ చెప్పుకుని అక్షింతలు వేసుకోవాలి. రెండవ ఏటఈవావిల లక్ష్మివారము నోము నోచుకుని కొత్తచేటలో కడిగిన బియ్యం అద్దెడుతౌడు (2-1/2 కేజి) కడుగని బియ్యం అద్దెడు (2కేజి) లుపోసి వావిలి కొమ్మనుంచి కొత్తరవికెల గుడ్డ దక్షిణ తాంబూలాలుంచి పైన పాతచేటతో మూతవేసి ముత్తైదువులకు గోడమీదనుంచి వాయనమియ్యాలి.

## 16. సంపద శుక్రవారము నోముకథ

పూర్వకాలంలో అవంతీ దేశంలోని వసంతపురంలో విష్ణుదత్తుడనే బ్రాహ్మణుండేవాడు. అతనికి ఏడుగురు కొడుకులు అందరికి వివాహాలయ్యాయి. వారిలో వారికి పొత్తు కుదరక ఎవరికి వారు వేరు వేరుగా కాపురాలున్నారు. ఇలా కాలం గడుస్తుండగా శుక్రవారపులక్ష్మీ గ్రామసంచారంచేస్తూ విష్ణుదత్తుని ఏడుగురు కోడళ్ల ఇళ్లకు వెళ్లింది. ఒక కోడలు వాకిలి తుడవకుండా పిల్లలకు చద్దన్నం పెడుతూ కనిపించింది. మరొక కోడలు



పాచివాకిలితో పిల్లలకు పేలు చూస్తున్నది. ఇంకొక కోడలు నిద్రమంచాల పక్కలు చక్కపెట్టకుండా పాతగుడ్డలు కుడుతూ కనిపించింది. మరొక కోడలు ఇల్లు ఊడ్చకుండా పిల్లలకు తలంటి నీళ్లు పోస్తున్నది. మరొక కోడలు ఇల్లు ఊడ్చకుండా వీధిగుమ్మంలో గచ్చకాయలాడుతూ అగుపించింది. ఆఖరుదైన చిన్నకోడలు పాన్పుపై కూర్చుని భర్తతో ఊసులాడుతున్నది. పెద్దకోడలు ఏం చేస్తుందో చూడాలని ఆమె ఇంటికి వెళ్లింది మహాలక్ష్మి ఇల్లు వాకిలిశుభ్రంచేసుకుని స్నానంచేసి పసుపురాసుకుని నుదుటకుంకుమ పెట్టుకుని దేవతార్చన చేసుకుని భర్తను ఆయవారానికి పంపి తానొక గదిలో కూర్చున్నది.

అరుగుమీదకూర్చుని మహాలక్ష్మి ఆమెనుపిలిచింది. నేను ఆవలకు వచ్చుటకు వీలుపడదు. నేను వివస్త్రను, మాకున్నది ఒకే వస్త్రము దానిని నాభర్తకిచ్చి ఆయవారమునకు సాగనంపితినని తెలిపింది. మహాలక్ష్మి తన చీరలో కొంతచించి ఆమెకిచ్చి కట్టబెట్టింది. అతివానాకుఆకలిగాఉన్నది సోలడు బియ్యం వార్చి పెట్టమన్నది. అందుకా ఇల్లాలు నాభర్త వచ్చువరకు నేనేమియు నీకువార్చిపెట్టలేను. ఇంట ఏమియూ లేని నిర్భాగ్యులము. ఆయన రావాలి ఆయన తెచ్చిన ఆయవారమే మాకు ఆధారం. ఉన్నదన్నదేది మాకులేదు. లేనిది నీకు ఏమి పెట్టగలను అని చెప్పింది. అంత మహాలక్ష్మి అతివా! నీవు కోమటి ఇంటికి వెళ్లు శుక్రవారం మహాలక్ష్మి మా ఇంటికి వచ్చిందని చెప్పి కావలసిన సరుకులు అడిగి తెచ్చుకోమన్నది. అందుకామె శెట్టి దుకాణమునకేగి శుక్రవారం మహాలక్ష్మి వచ్చిందని చెప్పి పప్పు, బియ్యం, వెచ్చాలు అడిగి తీసుకున్నది. తెలుకలవాని దగ్గరకు వెళ్లి నూనె, కంచరవానివద్దకు వెళ్లిపాత్ర సామానులు, అంగడికి వెళ్లి కాయగూరలు అడిగి తెచ్చుకున్నది. తెచ్చిన సరుకులతో వండివార్చినవగాయపిండి వంటలతో శుక్రవారం మహాలక్ష్మికి భోజనం పెట్టింది. అంతలో ఆమె భర్త తనకు లభించిన ఆయవారముతో ఎడమూట, పెడమూట భుజానమోసుకుని వచ్చాడు. ఆ ఇల్లాలు అతనికి సుష్టుగా భోజనం పెట్టి తానుకూడా కడుపారా సంతృప్తిగా తిన్నది. ఇవన్నీ ఎలా వచ్చాయని భర్త అడుగగా జరిగిన యావత్తూ భర్తకు వివరించింది. శుక్రవారం మహాలక్ష్మి వారి ముందుకువచ్చి నేనింక వెడుతున్నాను అని అన్నది అందుకా ఇల్లాలు తల్లి ఈ సమయమున ఎక్కడకు వెళ్ళగలవు కాసేపు విశ్రాంతి తీసుకుని రాత్రి భోజనము చేసి వెళుదువుగాని అని అభ్యర్థించింది. ఆ ఇల్లాలి కోరికప్రకారం రాత్రి భోజనం చేసి శుక్రవారం మహాలక్ష్మి బయలుదేరబోయింది. ఆమాట విన్న ఆ ఇల్లాలు అమ్మా రాత్రివేళ చీకటిలో ఎలా వెళ్ళగలవు ఈరాత్రి మాఇంట ఉండి రేపటిఉదయమున వెళ్లవచ్చునని అన్నది. అందుకామెఅంగీకరించింది. ఒక గదిలో ప్రక్కవేసి పరుండబెట్టింది. అర్ధరాత్రి శుక్రవారంమహాలక్ష్మినిద్రలేచినాకడుపునొక్కుతున్నది. అవతలకు వెడతానన్నది. ఇంతఅర్ధరాత్రి అవతలకు ఏంవెళతావు ఆ గదిలో కూర్చో ఉదయం నేను శుభ్రం చేస్తాను అన్నది. ఆవిధంగా ఆరాత్రి శుక్రవారం మహాలక్ష్మి నాలుగుసార్లు నాలుగు మూలల కూర్చున్నది. తెల్లవారుతూనే ఆ ఇల్లాలు గదిని శుభ్రం చేయడానికి గదిలోనికి వెళ్లింది. నలుమూలలా నవరత్నరాశులు గదిలో బంగారం వెండి వస్తువులు కనబడ్డాయి. వెనువెంటనే మహాలక్ష్మికొరకువెదికింది ఆమెకనిపించలేదు ఇదంతా శ్రీ మహాలక్ష్మి కరుణా కటాక్షమనిఎంతగానోఆనందించింది. ఆరత్నరాశులతో ఆభరణాలతోఆమెజీవితం సంపన్నమయింది. ఆనాటినుండిఆమెశుక్రవారంనోమునోచుకుంటూఆకుటుంబంహాయిగాజీవించారు.

**ఉద్యాపన :-** ప్రతి శుక్రవారం ఉదయమునే లేవాలి, ఇల్లువాకిలి శుభ్రముచేసికళ్లాపు జల్లి ముగ్గుపెట్టాలి. లక్ష్మీదేవిని పూజించి ఒంటిపూట భోజనం చెయ్యాలి. కథ చెప్పుకుని శుక్రవారంనాడుఅయిదుగురుపేరంటాళ్లనుపిలిచితలకుస్నానంచేయించి వారికిఒక్కొక్కరికిరవికల గుడ్డలు,దక్షిణ తాంబూలాలుఇచ్చిపాదాభివందనంచేసి వారిఆశీస్సులు పొందాలి. శ్రద్ధా-భక్తులతోచేసిన వ్రతం క్రమం తప్పరాదు తప్పిన ఫలం దక్కదు.

## 17. గొడిశ నోముకథ

**"గొడిసెనోము పట్టిన కోమలికి కోటివేలయేండ్లు అయిదవతనం అనుకొంటూ అక్షంతలు నెత్తిన వేసుకోవలెను"**

ఈవిధంగా ఒక ఏడాదిపొడుగునా అనుకుంటూఅక్షింతలువేసుకోవాలి. పాలు, చింత పండు ఉపయోగించకూడదు. ఆవిధంగా ఏడాది గడిచాక పదమూడు మంది ముత్తైదువులకు పదమూడు మూకుళ్లలో పులహోరపెట్టి తాంబూలం రవికెలగుడ్డ, పసుపు, కుంకుమ వాయనమివ్వాలి. సుఖసౌఖ్యాలకు ఐదవతనానికి వెలతి కలుగదు.

## 18. పోలాల అమావాస్య నోముకథ

పూర్వకాలంలో ఒక కుగ్రామమందు ఏడుగురు అన్నదమ్ములుండేవారు. వారిభార్యలు ఏడుగురుపోలాలఅమావాస్య నోమునోచుకొనవలెననినిర్ణయించుకున్నారు. అమావాస్య రేపనగా ఆఖరితోటికోడలుకు కొడుకుపుట్టిచనిపోవడంజరిగింది. అందువల్ల తోటికోడళ్లకు పోలాలఅమావాస్యనోమునోచుకోవడంజరుగలేదు.వారంతాచిన్నతోటికోడల్ని తిట్టుకున్నారు. ఆఖరికోడలు ఆరుసంవత్సరాలుపాటు పోలాలఅమావాస్య ముందురోజున బిడ్డనుప్రసవించడం, ఆ బిడ్డ చనిపోవడం ఆ కారణంగా వారుఆరు సంవత్సరాలు ఈనోమునోచుకొనుట జరుగలేదు. నోముచెడినదన్న ఉక్రోషంతో ఆరుగురు తోటికోడళ్లు చిన్నకోడల్ని నానా దుర్భాషలాడి బాధపెడుతుండేవారు.

ఏడవ సంవత్సరం కూడా యధాప్రకారం పోలాల అమావాస్య ముందురోజునచిన్న కోడలకి కొడుకుపుట్టడం జరిగింది. తోటికోడళ్లు ఈసడింపులకు దెప్పిపొడుపులకు వెరచి చిన్నకోడలు తనబిడ్డ శవాన్ని ఇంటదాచి తోటికోడళ్లతో కలసి పోలాల అమావాస్య నోము నోచింది. ఆనాటి రాత్రి ఆమె తన బిడ్డ శవాన్ని తీసుకుని పూడ్చిపెట్టటకుగాను ఊరిబయటకు బయలుదేరింది. గ్రామసంచారం చేస్తున్న పోలేరమ్మ బిడ్డా! ఎందుకేడుస్తున్నావు. ఈఅర్ధరాత్రివేళలో ఎక్కడకు బయలుదేరావని ప్రశ్నించింది. తల్లీ ఏడ్వక నేనేమి చేయగలను. ఈ బుజానగలవాడు నాబిడ్డడు నిన్నను చనిపోయాడు. గతంలో ఆరుగురు బిడ్డలు అమావాస్య ముందటిరోజున చనిపోవుట వల్ల నోములు నోచుకోవడంజరగలేదు. నన్ను నాతోటికోడళ్లు నానాదుర్భాషలాడి ఈసడించుకునేవారు. ఈసారికూడా వారివల్ల మాటలు పడలేక బిడ్డడి చావును దాచిపెట్టి పోలాల అమావాస్య వ్రతం చేసాను. అందువల్లనే యేడ్చుట, ఏడుగురు బిడ్డలను ఏడాదికొకరిని పోలేరమ్మకు అప్పగిస్తున్నాను. నామొర తీరేదా! తట్టుకోలేక అబద్ధమాడాను. నోము పూర్తవడంతోనే బిడ్డడి శవాన్ని పూడ్చేందుకు బయలుదేరానని చెప్పింది.



గ్రామ సంచారం చేస్తున్న పోలేరమ్మ ఆమె ఆవేదనకు జాలిపడింది. అమ్మవారు ఆమెకు కొన్ని అక్షింతలిచ్చి ఈ అక్షింతలను నీ కుమారులను పాతిన సమాధులపైచల్లి వారినివారివారి పేర్లతో పిలవవలసినదని చెప్పి అంతర్థితురాలయ్యింది. చిన్నకోడలు అక్షింతలతో వెళ్లిసమాధులపైన, తాను తెచ్చిన బిడ్డడి శవంపైనా చల్లి వాళ్లనువాళ్ల పేర్లను పెట్టిపిలిచింది. వారంతా సజీవులైలేచివచ్చి తల్లివెంట ఇంటికిచేరుకున్నారు. తోటికోడళ్లంతా జరిగినసంగతి అంతయూ వినిఆనందించారు. ప్రతిసంవత్సరంవాళ్లంతా పోలాలమావాస్య నోమును భక్తిశ్రద్ధలతో చేసి సుఖంగా జీవించారు.

## 19. పోలి స్వర్గానికి వెళ్లిన నోముకథ

పూర్వం ఒకానొక నగరమందు అయిదుగురు కోడళ్ళుగల చాకలి ఉండేది. ఆ కోడళ్లలోని ఆఖరు కోడలంటే వాళ్లెవ్వరికి కిట్టేదికాదు అందువల్ల వీళ్లు ఏంచేసినా ఏ పండుగ పబ్బం వచ్చినా చిన్నకోడల్ని పట్టించుకునేవారు కాదు తమతోకలుపుకునేవారుకాదు. చిన్నకోడలు పేరు పోలి. పోలి గుణవంతురాలు నిరాడంబరమైనట్టిది. వారంతా తనను ఎంత వెలితిభావంతో చూచినా ఏవిధంగానూ వారిని ఎప్పుడూ ఏమీ అనేదికాదు. తన పూజలు తనపనులు తాను చేసుకుంటుండేది. కార్తీకమాసం నెలరోజులు తోటికోడళ్లు అత్తగారు నదీస్నానానికి వెళ్లేవారు. పోలిని ఇంటిదగ్గర కాపలా ఉంచేవారు. ఇంటివద్దనే ఉన్న పోలి ఇంటిలోని నూతివద్దనే స్నానం చేసి మజ్జిగ చిలికి వెన్నతియ్యగా చివరన కవ్వానికంటిన వెన్నను తీసి పత్తిచెట్టువద్ద క్రిందపడిన ప్రత్తితో వత్తిని చేసి ఆవెన్నతో దీపారాధన చేసి దేవతారాధన చేసేది. నెల్లాళ్లు ఇలా ఎంతో భక్తితో ఆరాధన చేసిన ఆమె భక్తికి దేవతలు మెచ్చి దేవదూతలతో ఆమె కొరకు విమానం పంపించారు. దేవదూతలు ఆ విమానంలో పోలిని కూర్చుండబెట్టి స్వర్గానికి బయలుదేరారు. అదిచూచిన ఇరుగు పొరుగు వారు ఊరిలోనివారు పోలి స్వర్గానికి వెడుతున్నదని సంభ్రమాశ్చర్యాలతో కేరింతలు కొట్టిరి. నదీస్నానం చేస్తున్న అత్తగారు, తోటికోడళ్లు తమ మీదుగా విమానం వెలుతుండగా పోలికాళ్లు పట్టుకుని వ్రేలాడి పోలితో స్వర్గానికి బయలుదేరారు. అదిచూచిన దేవదూతలు మీకుస్వర్గలోకానికివచ్చే అర్హతలేదు. మీదంతా ఆడంబరం ఆమెపట్ల దురుసుగాను వెరుసుగాను ప్రవర్తించి పాపం మూటగట్టుకున్నారు. పోలి పరమభక్తురాలు. సాధ్వీమణి మిమ్మల్ని గాని మరెవ్వరినిగాని కించిత్తు పరువాక్యములతో తూలనాడలేదు. కార్తీకమాసం నెల రోజులూ భక్తితో జ్యోతిని వెలిగించింది. ఆమె మాత్రమే స్వర్గమునకు వచ్చుటకు అర్హురాలు మీకు ఆ అదృష్టములేదని వారిని దూతలు క్రిందకు త్రోసివేసినారు. శ్రద్ధ భక్తి, సాత్వికత గలవారికి ఈ వ్రతము స్వర్గప్రాప్తిని కలిగిస్తుంది. కనుక పోలి కథను చెప్పుకుని అక్షింతలు తలను దాల్చిన వారికి ఇహలోక సుఖము పరలోక మోక్షము సిద్ధిస్తాయి.

## ౨౦. నెల సంక్రమణం నోముకథ

**" నెల నెలావచ్చు సంక్రమణంనాడు నెలతలు నోచుకుని ఇహపరాలు ఫలింపజేసుకొను నోము ఇది. ఈ నోము నోచిన వనితకు ఇహమున వెలుగు పరమున వెలుగు పాడిపంటలతో ఇంట వెలుగు సంతాన సౌభాగ్యములు వెలుగు తనవారు వెలుగు నిత్యకర్మలందు వెలుగు సమస్తము వెలుగు పెరవారి చల్లని చూపుల వెలుగు వెలుగు వెలుగై సమస్తము వెలుగు "** అని చెప్పుకుని అక్షతలు శిరస్సున జల్లుకోవాలి.

**ఉద్యాపన :-** మాససంక్రమణం రోజున తలంటి స్నానంచేసి పైడిపత్తిని శేరుంపావు (1-1/4 కేజి) నూనెలో వేసి దీపారాధన చేయాలి. అది కొండక్కే పర్యంతం భోజనం చేయగూడదు. ఇలాఒక యేడాదిపాటుచేసి ఆఖరున భూరి దక్షిణలతో ముత్తయిదువును ఆరాదించి ఆశీస్సులు పొందాలి. అనంతరం అన్నదానం చెయ్యాలి.

## 21. కుందేటి అమవాస్య నోముకథ

పూర్వం ఒక ఊరియందలి చాకిరేవులో కొన్ని బానలుండేవి. వాటిలోని ఒక చాకలి బానయందు ఒక కుందేలు తన పిల్లలను ఉంచి తాను మేతకేగింది. అంతట చాకిరేవు కొచ్చిన చాకలి బానను సరిగా చూడకుండా పొయ్యిమీద పెట్టి నీళ్లుపోసి తాను తన పనులు చక్కబెట్టుకుంటున్నది. కుందేలు తిరిగివచ్చి తన పిల్లలకోసం బానచుట్టూ తిరగసాగింది. బిడ్డలారా బిడ్డలారా అని అరవసాగింది.

బానలో ఉన్న కుందేలుపిల్లలు ఎంత పనిచేసితివమ్మా? మేము చచ్చిపోవు చున్నాము అన్నవి. అందుకా తల్లిబిడ్డలారా! మీకొచ్చిన భయమేమిలేదు. మీరు చావకుండా చలిమిడి వాయనమిచ్చాను అన్నది.

తల్లిరో! మేము చిమిడిపోతున్నామని గోలపెట్టినవి. మీరు చిమిడిపోకుండా చిమ్మిలివాయన మిచ్చాను. మీకేం భయంలేదు అన్నది తల్లి కుందేలు.

అమ్మా! మేము వేగిపోతున్నామని పిల్లలు చెప్పాగా మీకేం భయంలేదు. మీరు వేగిపోకుండా వేపుడు బియ్యం వాయనమిచ్చాను భయపడకండన్నది తల్లి.

అమ్మా! పేలిపోతున్నామమ్మా అన్న కుందేటి పిల్లలతో నేను పేలాలవాయన మిచ్చాను మరేల పేలిపోదురని ధైర్యం చెప్పిందా తల్లి.

పిల్లలు తాము అడుగంటిపోవుచున్నామే తల్లి అనగా అరిసెల వాయనమిచ్చితి కాదా మీరెలా అడుగంటిపోవుదురు బిడ్డలారా అన్నదాతల్లి.

అంతట బిడ్డలు బొబ్బలు పెడుతూ పాకిపోయితిమే అమ్మా అన్నవి. మీరు పాకిపోకుండా పాయసం వాయనమిచ్చాను. మీకుభయంలేదన్నదికుందేలు. పొంగిపోతున్నా మన్న బిడ్డలతో మీరు పొంగకుండా పొంగుబూరెల వాయనమిచ్చా నన్నది తల్లి. కంది పోతున్నాం, మాడిపోతున్నాం అని బిడ్డలు రొదపెట్టగా కందిపోకుండా గారెలు, మాడపోకుండా పరమాన్నము వాయనమిచ్చితిని మీకెందుకు భయం అని బిడ్డల్ని ఊరడించింది.

బ్రతికితిమి, బ్రతికితిమి అని ఉప్పొంగిన సంతోషముతో కుందేటి బిడ్డలు అరవగా మీరు బ్రతికేటందుకు బియ్యము వాయనమిచ్చేను గాదా అన్నది తల్లి కుందేలు. అంతలో అక్కడకు వచ్చిన చాకలి కుందేలునుచూచి ఇక్కడికెందుకు వచ్చావని ప్రశ్నించింది. ఓయమ్మా నాబిడ్డలు నీబానయందు వేడినీటిలో ఉన్నారు. వారికొరకై కలవరపడుతున్నానన్నది. చాకలి బానలో ఉన్న అమరుగు నీటిలో ఈదులాడుతూ కనిపించిన కుందేటి పిల్లలను పైకితీసి కుందేటి ముందుంచి నీబిడ్డలింత సురక్షితంగా ఉండగలగడం విశేషమే మిటని ప్రశ్నించింది.

అమ్మా! నేనొక అమావాస్యనాడు మేతకై తిరుగుతూ ఒకచోట జరుగుతున్న వ్రతం దగ్గరకువెళ్లి పూజాక్రమంచూచికథవిని నేనూమనస్సున ఆవ్రతాన్ని చేసుకుంటున్న భావన



చేసి వాయనాలిస్తున్న ఊహచేసాను ఇదంతా ఆవ్రతప్రభావం వల్ల నాబిడ్డలు బ్రతికారు అని చెప్పింది. చూచినందున, విన్నందువల్ల మనస్సున భావించినందువల్ల ఇంత ఫలితాన్ని కలుగజేసిన ఈ అమావాస్య నోముచాలాగొప్పదనిభావించితాను కూడా నోమునునోచుకున్నది. కుందేటి అమావాస్యనోముఅన్ననామముఆనాటినుండి వ్యాప్తిలో నికివచ్చింది ఈ నోము నోచుకున్న వారికి ప్రమాదాలు రావు. ప్రమోదాలు కలుగుతాయి.

**ఉద్యాపన :-** మూడు మానికల బియ్యం చలివిడి చెయ్యాలి. ఆచలిమిడితో కుందేలు కుందేలుపిల్లలు ఆకారాలుగాఒత్తుకోవాలి. వాటినొక కొత్తబానలో ఉంచాలి. నల్లపూసలు, లక్కజోళ్లుజతచెయ్యాలి. చలిమిడిబొమ్మలు, నల్లపూసలు, రవికల గుడ్డ దక్షిణ తాంబూలంతో ఒకముత్తైదువుకు వాయనమియ్యాలి. ఇలా 13 అమావాస్యలు చెయ్యాలి. ఇలా చేయటం వల్ల ఆపదలు రావు. సుఖశాంతులకుబిడ్డల క్షేమానికిది ప్రశస్తమైననోము.

## 22. ముప్పది మూడు పున్నముల నోముకథ

పూర్వకాలంలో ఒక ఊరిలో ఒక బ్రాహ్మణుని కుమార్తె కలదు. ఆమెకు పెళ్లి జరిగిన మూడవనాడు స్నేహితురాలి ఇంటికి పేరంటమునకు వెళ్లింది. అంతలో ఆయుష్షు చెల్లి ఆమెభర్త చనిపోయాడు. ఆ బ్రాహ్మణవధువు స్నేహితురాలి ఇంటినుండి తిరిగివస్తున్న ఆమెను మార్గమధ్యమందు ముప్పదిమూడు పున్నముల నోము నోచుకున్న ఒకానొకామె వాయినమిస్తాను రమ్మని పిలిచింది. ఆ వాయనాన్ని అందుకుని ఆమె ఇంటికి చేరుకున్నది. ఇంటికి చేరిన మరుక్షణంలో ఆమెభర్త బ్రతికిలేచి కూర్చున్నాడు.

అతని దహన సంస్కారంలో పాల్గొనుటకు వచ్చిన బంధుజనులు ఈ ఆకస్మిక సంఘటనకు ఆశ్చర్యపోయారు. యేవమ్మా ఏ నోము నోచితివమ్మా చచ్చిన నీ మొగుడు బ్రతికిన విశేషమేమిటని ప్రశ్నించారు. అంతట ఆమె అయ్యలారా! అమ్మలారా! నేను ఏ నోమును నోచుకోలేదు. కాని ఒకానొక పుణ్యాత్మురాలు ముప్పది మూడు పున్నముల నోము నోచుకుని ఆమె ఇచ్చిన వాయనమును అందుకున్నాను. నాభర్తబ్రతుకుటకు వాయనమందుకున్న పుణ్యఫలమే అనివివరించింది. వాయనమందు కున్నందుకే ఇంత పుణ్యమును ప్రసాదిస్తే ఆనోము మరెంతటి పుణ్యప్రదమో అని చెప్పుకొనసాగిరి.

చనిపోయిన ఆమెభర్తను కొనిపోవవచ్చిన యమదూతలు అతని ప్రాణం తిరిగి అతని మృతదేహమునచేరడం అతడుసజీవుడుకావడంయమధర్మరాజు నకువివరించిరి అతని ప్రాణములు తీసుకొని వచ్చుట తమకుచేతనైన పనికాదనిరి. అందునిమిత్తం యమధర్మరాజు బయలుదేరివచ్చి అతని ప్రాణాలను తీసుకుని యమలోకానికి బయలుదేరాడు.

వాయనం పుచ్చుకున్న ప్రభావంవల్ల ఆ పతివ్రత యముడ్ని చూడగలిగి అతడిని వెన్నంటి బయలుదేరింది. ఎందులకు నావెంట వస్తున్నావని ఆమెను యమ ధర్మరాజు ప్రశ్నించాడు. నాభర్తకోసం వస్తున్నానన్నది. నీ భర్త ప్రాణాలు ఇవ్వడం కుదరదు. ఏదైనా వరం కోరుకోవలసిందన్నాడు. ఐదవతనాన్ని తనకు అనుగ్రహించమని కోరుకున్నది. యమధర్మరాజు ఆమెకా వరాన్ని అనుగ్రహించాడు. అయినా ఆ బ్రాహ్మణ వనిత యమ ధర్మరాజునువెన్నంటియేవెళుతున్నది. ఆమెనుచూచిన యమధర్మరాజు ఇంకనూ యేలవచ్చు

చున్నావనియముడామెను ప్రశ్నించాడు. నేను ముప్పదిమూడు కోవల నల్లపూసల వాయనం అందుకున్నాను. వాటికెన్ని బెజ్జములున్నవో అన్ని సంవత్సరాలు నాకు అయిదవతనం అనుగ్రహించమని వేడుకున్నది. ఆమె పతిభక్తికి మెచ్చుకుని యముడామె భర్త ప్రాణాలను ఇచ్చివేసాడు ఆమెభర్త సజీవుడయ్యాడు. అందరూ ఈనోము గొప్పతనాన్ని పొగుడుకున్నారు. అందరూ ఆనోమును నోచుకుని అయిదవతనం అష్టయిశ్వర్యాలతో సుఖంగా జీవించారు.

**ఉద్యాపన :-** ప్రతినెలలోవచ్చు పౌర్ణమిరోజున ఉదయాన్నే లేచి తలస్నానం చేసి శ్రద్ధా భక్తులతో పూజచేసుకొని కథచెప్పుకోవాలి. ముప్పదిమూడుపూర్ణచంద్రదర్శ నాలను చూచి నమస్కరించుకోవాలి. ముప్పయిమూడునాట్లున్న జల్లెడలోముప్పదిమూడుకోవల నల్ల పూసలు, ముప్పదిమూడుజ్యోతులు, ముప్పది మూడు తాంబూలాలు ఉంచి వాటిపై జల్లెడను మూసి ముత్తయిదువులకు రవికెల గుడ్డ ఫలపుష్ప తాంబూల దక్షిణలతో వాయనమియ్యాలి.

## 23. ఉండ్రాళ్ల తద్ది నోముకథ

Bhadra padam

భాద్రపద బహుళ తదియనాడు నోచుకొను నోము ఉండ్రాళ్లతద్ది నోము ఒకానొక ఊరి రాజుగారి ఉంపుడుగత్తె ఈ ఉండ్రాళ్లతద్ది నోము నోచుకోవలెనని తలచి రాజునకు ఆ సంగతిని చెప్పింది. అందుకా రాజు ఈ నోమునకు ఏమి కావలెనని తన ఉంపుడు గత్తెను అడిగెను. అందుకా వెలయాలు ఆకూ గీకూ, కోకా గీకా, పూలూ గీలూ, కావలెనని చమత్కారముగా పలికింది. రాజు తనభటులకు ఆపదార్థములను తేవలసినదని ఆజ్ఞాపించాడు. వాళ్లుగీ అను అక్షరంతో గల పదార్థాలు తేలేకపోయిరి. ఈ సంగతిని రాజు తన ఉంపుడు గత్తెకు చెప్పగా ఆమె రాజును ఇంతేనా మీ ప్రతిభ అని దెప్పిపొడిచింది.

రాజు తనకు దాసోహం అంటున్నందువల్లను తాను అందగత్తెను మేధావిని అన్న అహంకారంవల్ల, తనమాట కొరకు తన పొత్తుకొరకు ఉవ్వీళ్లూరుతూ ఎగబడే విటులజూచి విర్రవీగుతున్న ఆవేశ్యనోముపట్ల చాలానిర్లక్ష్యం వహించసాగింది. తాను నోము నోచుకొనక పోవడానికి రాజు చేతకానితనమే కారణమని నిందించసాగింది. కాలం గడిచింది ఆమె సిరిసంధపలు తరిగాయి. వేషభాషలు మారాయి. రాజుఆధరణపోయింది. ఇలాఉన్నఆమె పరిస్థితిని చూచిన పురోహితుడు నీవు నోముపట్ల చూపిన నిర్లక్ష్యము నీ ఈ దుస్థితికి కారణము గుర్తెరిగి ఆవ్రతమును భక్తితో చెయ్యి నీ పరిస్థితి మారవచ్చని హిత బోధ చేసాడు. జ్ఞానోదయమైన ఆవేశ్య భాద్రపద బహుళ తదియనాడు తలంటి నీళ్లు పోసుకుని గౌరీదేవికి అయిదు ఉండ్రాళ్లు నైవేద్యము పెట్టి వాటిని పేరంటాళ్లకు వాయనమిచ్చింది. తదనంతరం ఆయురారోగ్యఐశ్వర్యాలు రాజానుగ్రహం కలిగి సుఖంగా జీవించింది.

**ఉద్యాపన :-** భాద్రపదశుద్ధ తదియ ఉషోదయాన తలంటి నీళ్లుపోసుకుని తదియ తెల్లవారుఝామున భోజనం చేసి ఆనాటి సాయంత్రం వరకు యేమి తీసుకోకుండా ఉండాలి. చీకటి పడడంతో గౌరీదేవికిపూజచేసి అయిదు ఉండ్రాళ్లను నైవేద్యంగా పెట్టాలి. అయిదుండ్రాళ్లు పేరంటాలకు వాయనమివ్వాలి ఇలా అయిదు సంవత్సరాలు చేయాలి. తదుపరి అయిదుగురు ముత్తైదువులకు తలంటి నీళ్లుపోసి గోరింటాకు ఇచ్చి ఒక్కొక్కరికి పదేసి కుడుములు రవికల గుడ్డ దక్షిణ తాంబూలాలతో వాయనమివ్వాలి.



## 24. సౌభాగ్య తదియ నోముకథ

Magh

పూర్వకాలంలో ఒకఊరిలో ఒకబ్రాహ్మణ చిన్నది వివాహమైన కొద్దిరోజులకే విధవరాలై యింది. తన దుర్భర పరిస్థితికి విరక్తి చెందిన ఆ బ్రాహ్మణ వితంతువు అడవికి పోయి తపస్సు చేయసాగింది. పార్వతీ పరమేశ్వరులు ఆమె తపస్సుకు మెచ్చి సాక్షాత్కరించారు. ఏమికోరి తపస్సు చేస్తున్నావని ఆమెను ప్రశ్నించారు. జగజ్జననీ జనకులారా విధవరాలిని నాకేమికోరిక కలదని మిమ్ములను కోరుకోను అన్నది. అందుకా పార్వతీ పరమేశ్వరులు అనుగ్రహం కలిగినవారై బిడ్డా! గతజన్మమున సౌభాగ్యవతి నోమును ఉల్లంఘించితివి. అందువల్ల నీకీవైధవ్యం కలిగినది ముందు జన్మముకొరకు ఈజన్మమున ఈనోమునునోచు కొనుముఅనిచెప్పి అంతర్హితుల య్యారు. వారి ఆదేశము మేరకు ఆమె సౌభాగ్య తదియ నోమును నోచుకొనెను.

**ఉద్యాపన :-** ప్రతినెలాపౌర్ణమి వెళ్లిన తదియనాడు ఈ నోము నోచుకోవాలి. ఆ రోజంతా ఉపవాసముండి ఆరాత్రి అత్తెసరు చేసుకుని ఉప్పువెయ్యకుండా చప్పిడిగా తినాలి ఆరోజంతా ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా ఉండాలి. ఈ ప్రకారం ఒక ఏడాది చెయ్యాలి. సంవత్సరం ఆఖరున పౌర్ణమినాడు మౌనంగా ఉండి ఉద్యాపన చేసుకోవాలి. వీశేబులం (1-3/4 కే.జి) పసుపుకొట్టి దానిని పదమూడువెదురుబుట్టలలో వేసి ఆ బుట్టల్లో ఒక్కొక్క దానిలో లక్కజోళ్లు నల్లపూసలు రవికెల గుడ్డ వేయాలి. వాటినిపదముగ్గురు ముత్తైదువులకు దక్షిణ తాంబూలాలతో వాయనం ఇవ్వాలి.

## 25. విష్ణు విదియ నోముకథ

Magha Masam

పూర్వకాలంలో ఒకఊరిలో ఒకరాచకన్య బ్రాహ్మణకన్య ఇద్దరూ విష్ణు విదియ నోము నోచుకోవాలని నిశ్చయించుకున్నారు. శివరాత్రి వెళ్లిన విదియనుండి మళ్లీశివరాత్రి వరకు ప్రతివిదియ రోజున నోచుకోవలసిన ఈనోమును రాజకుమార్తెభక్తిశ్రద్ధలతోచేసింది.బ్రాహ్మణ కుమార్తె తనకు అన్నీ తెలుసునన్న గర్వంతో నోమును చాలా నిర్లక్ష్యంగా చేసింది.

కాలక్రమేణా రాకుమార్తెకు సంతోష సౌఖ్యాలు సిద్ధించాయి. బ్రాహ్మణ వనిత పరిస్థితులు తారుమారైపోయాయి. దారిద్ర్యము కలిగిపడరాని బాధలు అనుభవిస్తున్నది. అనుదినం దుఃఖిస్తుండేది. ఒకనాడు పార్వతీ పరమేశ్వరులు కనికరించి సాక్షాత్కరించి విష్ణు విదియ నోము నోచుకోవలసినదిగా చెప్పారు. వారు చెప్పిన ప్రకారం బ్రాహ్మణ స్త్రీ విష్ణు విదియ నోమునోచింది. సంవత్సరాంతము నందు ఉద్యాపన చెప్పుకున్నది. తిరిగి గత వైభవాన్ని సిరిసంపదలను ఆయురారోగ్యాలను పొందింది.

**ఉద్యాపన :-** శివరాత్రి వెళ్లిన తదియనాడు మొదలుపెట్టి ఆ తరువాత శివరాత్రి వరకు నోచి ఆఖరున ఉద్యాపన చేసుకోవాలి. ఉద్యాపనకు అత్తిసరు వండుకుని చప్పిడిగా భుజించాలి. పూజాదినాన మౌనంగా ఉండాలి. సంవత్సరం ఆఖరున పౌర్ణమినాడు ఉద్యాపన చేసుకోవాలి. వీశేబులం (1-3/4 కె.జి) పసుపుకొట్టి పన్నెండు వెదురు బుట్టలలో వేసి ఒక్కొక్కదానిలో లక్కజోళ్లు నల్లపూసలు రవికెలగుడ్డఉంచాలి. ఆబుట్టలను పన్నెండుగురు ముత్తైదువులకు తలా ఒకటి దక్షిణ తాంబూలాలతో వాయనమియ్యాలి.

## 26. అట్లతద్ది నోముకథ

ఇది ఆశ్వీయుజ బహుళ తదియనాడు నోచుకొను నోము పూర్వకాలంలో ఒకానొక రాజకుమార్తె తన చెలికత్తెలతో పాటు తాను కూడా అట్లతద్ది నోమును నోచుకున్నది. నోము నియమానుసారం చంద్రోదయము వరకు ఉపవాసముండి తదుపరి భోజనం చెయ్యాలి. ఉపవాసంతో ఉన్న రాకుమార్తె సొమ్మసిల్లి పడిపోయింది. ఆమె తోబుట్టువులు ఆలోచనచేసి చెట్టునకొక అద్దమునుకట్టి దానికెదురుగా మంటను పెట్టారు. చంద్రుడు వచ్చాడని కేకలుపెట్టి చెల్లెలికి అద్దములో కనబడు మంటను చూపించారు. నిజమనుకొని ఆమె భోజనము చేసింది.

కొంతకాలానికి ఆ కన్యకు యుక్తవయస్సు వచ్చింది. ఆమెకు వరుని కొరకు దేశదేశాలు గాలించారు. ఎక్కడ ప్రయత్నించినా ఎంతగా ప్రయత్నించినా ఆమెకు ముసలివారే లభిస్తున్నందువల్ల వారు విసిగిపోయి తెగించి ముసలివానికే ఇచ్చి ఆమెకు వివాహం చేయుటకు నిశ్చయించారు. రాచకన్య అందులకు అంగీకరించలేదు.

వారిబలవంతానికి తలవంచక ఆమెఒకనాటి అర్ధరాత్రికోటవిడిచిఅడవికి వెళ్లి పోయింది. అమ్మవారి గుడిముందు మర్రిచెట్టు క్రిందకూర్చుని అమ్మవారిని తలచుకుంటూ పరిపరి విధాలుగా దుఃఖించసాగింది. పార్వతీ పరమేశ్వరులు కరుణించి సాక్షాత్కరించి ఎందుకిలా అడవిలోఒంటరివై దుఃఖిస్తున్నావని అడిగారు. అందుకామె వారికి తన పరిస్థితిని వివరించింది.

అందుకా పార్వతీపరమేశ్వరులు అమ్మానీవుగతమున అట్లతద్దినోమునోచి చంద్ర దర్శనము చేయకనే భుజించి వ్రతనియమును ఉల్లంఘించితివి అందువల్లనే నీకీదుస్థితి. స్వస్థానమునకు వెళ్లి మరలానోమునోచుకుని చంద్రోదయం వరకు ఉపవాసముండి చంద్ర దర్శనము చేసుకుని పిమ్మట భోజనము చేయవలసినదని హితవు చెప్పి అదృశ్యమయ్యారు.

పార్వతీపరమేశ్వరులు చెప్పినప్రకారం రాచకన్య ఆశ్వీయుజ బహుళ తదియ నాడు సాయంత్రం వరకు ఉపవాసముండి నోము నోచుకుని సంధ్యా సమయమున చంద్రదర్శనం చేసుకున్నది. నోము ఫలితముగా ఆమెకు చక్కని వరుడు లభించాడు.

**ఉద్యాపన :-** ఆశ్వీయుజ బహుళ తదియ అట్లతద్ది. ఈఅట్లతదియనోము నోచుకుని పగలంతా ఉపవాసముండి సాయంత్రం పూజచేసుకొనవలెను. గౌరీదేవికిపది అట్లు నైవేద్యం పెట్టాలి. పదిఅట్లు, తోరము ముత్తయిదువుకు వాయనమియ్యాలి. ఇట్లు పదిసంవత్సరాలు చేయవలెను. ఆ తదుపరి నల్లపూసలకోవ, లక్కజోడు, పదేసిఅట్లు, దక్షిణ తాంబూలాలతో పదిమంది ముత్తైదువులకు వాయనం ఇవ్వవలెను.

## 27. పదహారు కుడుముల తద్ది నోముకథ

ఇది భాద్రపద శుద్ధ తదియనాడు నోచుకొను నోము. పూర్వం ఒక గ్రామంలో ఇద్దరు అక్కాచెల్లెళ్లుండేవారు. ఒకామెకు పూజలు పునస్కారాలు అంటే భక్తి. రెండవదైన చిన్నదానికి పూజలు అంటే విశ్వాసం భక్తిలేదు. ఇలా కొంతకాలం గడిచిపోయింది. పెద్దామె సంపన్నుల ఇంటి కోడలయ్యింది. అత్తవారింటికి పోయి సుఖంగా జీవిస్తున్నది.



చిన్నామె క్రమక్రమంగా కష్టాలు పాలైయింది. అమ్మవారి ఆలయానికి వెళ్లి ఘోరు ఘోరున దుఃఖించసాగింది. అమ్మవారికి కరుణ కలిగి సాక్షాత్కరించి అమ్మాయి నీవు భక్తి భావము లేక ఏనాడు ఏవ్రతముగాని, నోముగాని నోచుకోనైతివి అది చాలక నన్ను ఎగతాళి చేసేదానివి అందువల్లనే నేడు నీకీ కష్టాలు. రానున్న భాద్రపద శుద్ధ తదియకు పదహారు కుడుముల తద్దినోమును నోచుకో నీకష్టాలు తొలగిపోతాయని చెప్పింది.

అమ్మవారి మాటయందు గురి కలిగిన చిన్నమ్మాయి భాద్రపద శుద్ధ తదియనాడు తలంటి స్నానంచేసి పదహారు కుడుములు చేసి చేటయందుంచి పూజకు పూలు తెచ్చు కొనుటకు తలుపు జారవేసిఅవతలకు వెళ్లింది. అంతలో ఒకకుక్క ఇంటిలో దూరి చేటలోని కుడుములను తినేసింది. అందుకా చిన్నది బెదరక కోపించక ఇదంతా అమ్మవారి సంక ల్పంగా భావించింది. వెళ్లిపోతున్న కుక్కకు మనసారా నమస్కరించింది. నివేదించవలసి ఉన్న మూడుముంతల చల్లనుకుక్కకే పోసింది. ఆమె ఏకాగ్రత భక్తికి మెచ్చి ఆ కుక్క గౌరీ దేవిగా ఆమెకు సాక్షాత్కరించి అమ్మాయి నీ భక్తికిమెచ్చాను. నీకు అష్టైశ్వర్యాలను ఇచ్చానని పలికి అంతర్హితురాలయ్యింది. సకల భోగాలను పొంది ఆ చిన్నది సుఖంగా జీవించింది.

**ఉద్యాపన :-** పదిచేటలలో ఒక్కొక్కదానిలో పదహారు కుడుములు నల్లపూసలు, లక్కజోళ్లు దక్షిణతాంబూలాలు పసుపు,కుంకుమ రవికెలగుడ్డఉంచి పదిమంది పేరంటాళ్లకు ఒక్కొ క్కరికిఒక్కొక్కచేటఇచ్చివాయనంఇవ్వాలి. మూడుముంతలమజ్జిగనుఅమ్మవారికి నివేదించాలి.

## 28. దీపదానము నోముకథ

పూర్వకాలమందు ఇద్దరుతోడికోడళ్లు ఉండేవారు. వారికి ఒకరికొకరికి పొత్తు ఉండేది కాదు. పెద్దామెకు చిన్నామెమీద కోపం చిన్నామెకు పెద్దామెమీద అసూయ. పెద్దకోడలు చేసే పనులు చిన్నకోడలు సమానంగా చేస్తుండేది. నీకు నేనే మీ తీసిపోనని ఈర్ష్యకలిగి ఉండేది. చిన్నామెపూజాపునస్కారాలందుదీపారాధనచేస్తున్నపుడు అర్ధరాత్రిదీపం ఆరిపోతుం డేది. అందుమీదట అత్తగారు ఆమెను తిడుతుండేది. ఈ మాటలు పడలేక చిన్నకోడలు ఒకనాడు ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది. నిద్రలో ఆమెకు అమ్మవారు వృద్ధురాలి వలె కలలో కనబడి నీకీ దుఃఖం తొలగిపోవాలంటే దీపదానము నోము నోచుకోవాలి అని చెప్పింది. ఆమె మాటయందు విశ్వాసముంచి నోము నోచుకున్నది.

**"నోము నోచిన నెలతకు తొలగును పాపాలు. దీపదానము వలన కలుగు పుణ్యము"**

అనుకొనుచూ అక్షింతలు నెత్తిన వేసుకొనేది.

**ఉద్యాపన :-** ఈనోముకార్తీక మాసములోనోచుకోవాలి. ముప్పదిమూడు ప్రమిదలలో కమలవత్తులను వేసి వెలిగించాలి. ఆ జ్యోతులు వెలుగుతుండగా ఒక సద్బ్రాహ్మణునకు దక్షిణతాంబూలాదులతోదానమివ్వాలి. పదమూడుపోగులతోవత్తిని చేసి దానిని ఎనిమిది తునకలను చేసి ఆ తునకలను వత్తిగా చేయాలి ఈ వత్తిని కమలవత్తి అంటారు.

## 29. నవగ్రహ దీపాల నోముకథ

కైలాసపర్వతం మీద సమస్త రుద్రగణాలతో కూర్చుని ఉన్న పరమేశ్వరుడ్ని ఉద్దేశించి పార్వతి స్వామీ! నరుల మనోవాంఛితాలను నెరవేర్చు వ్రతాన్ని దేనినైనా ఉపదేశించి లోకానికి మేలు చేయవలసినదిగా కోరుకున్నది.